కదిలిన ఎద్దుల రథం

బండిశూల ఉత్సవాలు ప్రారంభం



బండిశూల రథోత్సవం

పామిడి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామరాజుపల్లిలో వెలసిన సుంకులమ్మ, ముత్యాలయ్య బండిశూల ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కాతమ్ముళ్లయిన సుంకులమ్మ, ముత్యాలయ్యను ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలతో చిలకమ్మ పల్లకిలో ఉత్సవ విగ్రహాలను రథోత్సవం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ఆనందోత్సాహాల నడుమ ఏడు కాండ్ల ఎద్దులతో బండిశూల రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పామిడి సీఐ యుగంధర్.. సిబ్బందితో తగిన చర్యలు చేపట్టారు. ఉత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

ప్రాణాలు తీసిన సెలవులు

పీబీసీలో మునిగి చిన్నారుల మృతి

కాపాడే ప్రయత్నంలో నాన్నమ్మ కూడా.. (7లో..)

నేత్రపర్వంగా వాసవీ జయంతి



అనంతపురంలో వాసవీమాత నగరోత్సవం నిర్వహిస్తున్న కొత్తూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు

వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా నేత్రపర్వంగా జరిగాయి. వాసవీ మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆర్యవైశ్య, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారి నగరోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శలు ఆకట్టుకున్నాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



అనంతపురం పాతూరులో వజ్రకవచ చీర అలంకరణలో వాసవీమాత

హంద్రీనీవా పనులు సకాలంలో పూర్తి చేస్తాం

మాజీ ఎమ్మెల్యే విశ్వవి

చౌకబారు వ్యాఖ్యలు

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



హంద్రీనీవా కాలువ పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల

గుంతకల్లు, మే 7(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా పనులను సకాలంలో పూర్తి చేసి, జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సీఎం చంద్రబాబు జిల్లాకు శుక్రవారం వస్తున్న నేపథ్యంలో అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్‌తో కలసి వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద హెలిప్యాడ్, గ్రామ సభ స్థలాన్ని మంత్రి సందర్శించారు. సభలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని, సభ సజావుగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సభకు వచ్చే జనానికి తాగునీరు, ఆహారం సమకూర్చాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9న ఛాయాపురం గ్రామానికి సీఎం వస్తున్నారని తెలిపారు. హంద్రీనీవా విస్తరణ పనులు సకాలంలో పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్ గాని, అప్పటి స్థానిక ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిగాని హంద్రీనీవాలో గంప మన్ను కూడా తీయలేదని విమర్శించారు. ఉరవకొండలో ఒక డ్రైనేజీ కాలువ కూడా తవ్వని విశ్వేశ్వరరెడ్డి ఈ రోజు హంద్రీనీవా గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్లు ఏమీ చేయకుండా చేతులు ముడుచుకుని కూర్చుని ఇప్పుడు మాట్లాడితే ప్రజలు ఏమనుకుంటారో అన్న ఆలోచనకూడా విశ్వకు లేకుండా పోయిందని అన్నారు. తన ఉనికిని కాపాడుకోవడానికే హంద్రీనీవాలో పనులే జరగడం లేదని అసత్యాలు మాట్లాడుతున్నారని అన్నారు. తాగునీరు, సాగునీరు వచ్చింది టీడీపీ హయాంలోనే అని అన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో గంప మట్టిని కూడా తీయలేని అసమర్థుడు, ఒక కొళాయి కూడా వేయలేని చేతకాని వాడు విశ్వేశ్వరరెడ్డి అని విమర్శించారు. హంద్రీనీవాను ఆరు పంపుల స్థాయి నుంచి 12 పంపులతో నీరు పారేలా కాలువను వెడల్పు చేస్తున్నామని అన్నారు. ఈ బృహత్ కార్యక్రమానికి అవసరం అనుకుంటే సలహాలు ఇవ్వాలని హితవు పలికారు. హంద్రీనీవా పనులు పూర్తిచేసి జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూతేటి వెంకటేశ్వర్లు, మారయ్య, దేవినేని పురుషోత్తం, దాసరి ప్రతాప్ నాయుడు, నాగరాజు, నాగేంద్ర, అనంతయ్య, మనోహర్, నాగభూషణం, గోవిందు, వలి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు సీఎం రాక.. కలెక్టర్ సమీక్ష

సీఎం పర్యటనకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఛాయపురం వద్ద అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. మూడు వేల మంది జనం కూర్చునేలా సభా స్థలాన్ని సిద్ధం చేయాలని సూచించారు. అంతకు మించి జనం లేకుండా చూడాలని, సభలో గ్రామస్థులు, ఆయకట్టుదారులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీఎం పర్యటన కోసం అనసరంగా చెట్లను నరకవద్దని అన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సభలో వేదికపైకి వెళ్లే బంగారు కుటుంబాల వారితో కలెక్టర్ సమావేశమయ్యారు. గ్రామ శివారులో హెలిపాడ్‌ను ఎస్పీతో కలిసి పరిశీలించారు.

బడి బ్యాగు.. ఇక.. తేలికే..!

పిల్లలపై భారం తగ్గించేలా విద్యాశాఖ నిర్ణయం (6లో...)

పైసలిస్తేనే పని..!

తహసీల్దార్ కార్యాలయాల్లో అవినీతి రాజ్యం

- ప్రతి ఫైల్‌కూ ఓ రేటు
- అనంతపురం రెవెన్యూ డివిజన్‌లో హెచ్చుమీరిన అక్రమాలు

అనంతపురం క్రైం, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రతి పేపర్‌కో రేటు. 1బీ అడంగల్ నుంచి డెత్ సర్టిఫికెట్ల వరకు ప్రతి పనికీ పైసలు రావాల్సిందే. ల్యాండ్ కన్వర్షన్, మ్యుటేషన్, పాసుపుస్తకాల మార్పు, మిగులు భూములు లాంటి విషయంలో వారెంత అడిగితే అంత. ఇక మట్టి తవ్వకాలు, ఇతర నిర్మాణాల అనుమతుల విషయంలోనూ ఆమ్యామ్యాలే నడుస్తున్నాయి. అనంతపురం డివిజన్ పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో కొందరు ముడుపులు తీసుకోకుండా ఏ పనీ చెయ్యరనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. వీఆర్వోల నుంచి తహసీల్దార్ల వరకు వసూల్ రాజాలుగా మారారు. ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ముడుపులిచ్చిన వారికే త్వరగా పనులు చేసేస్తున్నారు. ఇక అక్రమాల విషయంలోనూ అంతే. చేయి తడిపితేనే పని చేసి పెడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలు పరిష్కారం కాక కలెక్టరేట్ వరకు వెళ్తున్నారంటే అదంతా అధికారుల పుణ్యమే.

పుట్లూరులో అవినీతిమయం



పుట్లూరు తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి హెచ్చుమీరిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ఓ కీలక అధికారి అంతా తానై వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. మరో చిన్న సారు.. భూముల విషయాల్లో రెవెన్యూ కోసం ప్రయాస పడుతుంటారట. అనుమతులు లేకుండా ఓ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ వేసినందుకు రూ.2 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. ఓ గోడౌన్ నిర్మాణం విషయంలోనూ రూ.1.50లక్షలు ముట్టాయనే ఆరోపణలున్నాయి. ఓ రైతు మిగులు భూమి కింద ఉండిపోయింది. ఆ భూమిని తన పేరుతో ఎక్కించుకోవడానికి రూ.50వేలు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఓ వైసీపీ నాయకుడు.. తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ విషయంలో పలువురికి పనులు చక్కబెట్టి బాగానే వసూలు చేశాడని తెలిసింది. ఓ గ్రామంలో క్రషర్ ఫ్యాక్టరీకి అనుమతులు రెన్యువల్ చేసే విషయంలో సంబంధిత అధికారికి ఆమ్యామ్యాలు అందినట్లు తెలిసింది. ఇక ప్రత్యేక మట్టి బెలుకును ఇష్టారాజ్యంగా తోలుకుంటున్నారు. ఈ విషయంలో అధికారులు రాకుండా ఉండటానికి ఓ వైసీపీ సర్పంచ్ ఓ రోజు రాత్రి సంబంధిత అధికారితో రెండు గంటలపాటు చర్చించి ముడుపులు అందజేసి వచ్చినట్లు తెలిసింది. రెండు ప్రాంతాల్లో బెలుకు తరలించడానికి పెద్ద మొత్తంలో ఇచ్చినట్లు సమాచారం. ఇక ఇక్కడ కీలక అధికారి తన దగ్గరకు వచ్చిన వారితో 'టచ్‌లో ఉండండి.. కలుద్దాం..' అంటూ చెబుతుంటారు. అన్ని వ్యవహారాలు ఎక్కువగా బయటే ముగించుకొస్తారనే ప్రచారం సాగుతోంది.



పుట్లూరు తహసీల్దార్ కార్యాలయం

పాసుపుస్తకాల్లో మాయాజాలం

ఆత్మకూరు మండలంలో పాసు పుస్తకాల్లో మాయాజాలం చేశారు. తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్‌కు మధ్య కేడర్‌లో ఉన్న ఓ చిన్నస్థాయి అధికారి ఇక్కడ అలాంటి వ్యవహారాలు బాగానే చేశారు. వైసీపీ హయాంలో నుంచి పనిచేస్తున్న ఈయన ప్రతి పనికీ పైసలు వసూలు చేస్తుంటారు. గతంలో ఇక్కడ వచ్చిన ఆరోపణలతో అప్పటి తహసీల్దార్ తిప్పేస్వామిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆత్మకూరులో షాజహాన్ అనే రైతు జగన్‌మోహన్‌రెడ్డి నుంచి ఐదెకరాల భూమి కొనుగోలు చేశాడు. ఆరేళ్ల నుంచి షాజహానే సాగులో ఉన్నాడు. అది పాసుపుస్తకం చేయించుకునే క్రమంలో అధికారులు డబ్బు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అమ్మిన వ్యక్తే తన భార్య, అంగన్‌వాడీ టీచర్ పేరుతో పాసుబుక్కు చేయించుకున్నారు. ఈ పాసుబుక్కు ముసుగులో రెండు వేర్వేరు బ్యాంకుల్లో రూ.4 లక్షల వరకు రుణం పొందాడు. అధికారులేమో షాజహాన్‌కు నివేదిక ఆర్డీఓ కార్యాలయానికి పంపామంటున్నారు. ఆ రైతుకు ఇప్పటి వరకు న్యాయం జరగడం లేదు. పాసుపుస్తకం విషయంలో అప్పట్లో ఓ తహసీల్దార్, ఓ ఆర్ఐ కీలక పాత్ర పోషించారనే ఆరోపణలున్నాయి. సాగులో ఉన్నవారిని పక్కన పెట్టి లేనివారికి పాసు పుస్తకాలు చేయించడంలో ఈయన దిట్ట. ఇలాంటివి మండలంలో కోకొల్లలుగా ఉన్నాయి. రైతులు అధికారుల చుట్టూ తిరగడమే తప్ప.. సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇప్పటికీ ఆ చిన్నసారు వైసీపీ వారికి అనుకూలంగానే పని చేస్తుంటారట. భూముల ఫైళ్ల విషయంలో ముడుపులుంటేనే పనిచేస్తారన్న విమర్శ ఉంది.

అక్కడ పంచాయితీలతో ముడుపులు...

నార్పల తహసీల్దార్ కార్యాలయంలో భూ వివాదాల విషయంలో సివిల్ పంచాయితీలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇక్కడ ఓ మేడమ్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆమె భర్త కనుసన్నల్లోనే ఈ పంచాయితీల్లో ముడుపులు మాట్లాడేసుకుంటారని సమాచారం. మండలంలోని గూగూడు పరిధిలో పలు భూముల్లో ఆమ్యామ్యాలు బాగానే అందినట్లు తెలిసింది. ఇక ఈ మేడమ్‌ను కలవడానికి ప్రజలు, రైతులు గంటల కొద్దీ వేచి చూడాల్సిందేనట. ఫోన్‌లో కూడా స్పందించరని సమాచారం. సర్వసభ్య సమావేశాల్లో ఎవరైనా సమస్యలపై విన్నవిస్తే కోపంగా ఆ వినతిపత్రం విసిరేసి వెళ్లిపోతారట. ఈ మేడమ్ తన సామాజికవర్గానికే అధిక ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. ఇక్కడి నుంచి అనంతపురం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లే ఫైళ్లకు సంబంధిత అధికారులకు ముడుపులు ముట్టాల్సిందే. పోనీ ఆ రిపోర్టులు కూడా సరిగా ఉండవనే విమర్శలున్నాయి.

గంపెడు మట్టిని తీశావా విశ్వా..?

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఫైర్



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): 'విశ్వా..! నీవో అసమర్థుడివి. మీ పార్టీ ఐదేళ్ల పాలనలో హంద్రీనీవాలో గంపెడు మట్టినైనా తీశారా'..? అని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మండిపడ్డారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో విశ్వ చేసిన విమర్శలపై ఘాటుగా స్పందించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్‌లతో కలిసి బుధవారం మీడియాతో మాట్లాడారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఉరవకొండ నియోజకవర్గం నుంచి ఏడు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేస్తే 5 సార్లు గెలిచారని, విశ్వ 5 సార్లు పోటీ చేసి, ఒక్కసారి గెలిచారని ఎద్దేవా చేశారు. వైసీపీ పాలనలో రైతులు, ప్రజలకు ఏం చేశావో చెప్పాలని సవాల్ విసిరారు. వైసీపీ హయాంలో హంద్రీనీవాగురించి ఒక్క రోజు ఆలోచించిన పాపానపోలేదని ఆలం అన్నారు. తమ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు చేస్తుంటే ఓర్వలేక అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే హంద్రీనీవా విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. విమర్శలు చేసే ముందు గతంలో మీరు ఏం చేశారో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి మాట్లాడుతూ అసమర్థనాయకుడిగా ముద్ర వేసుకున్న విశ్వేశ్వరరెడ్డి హంద్రీనీవా పనులపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. మీ హయాంలో ఇప్పేరు చెరువుకు నీరు తేవడంలో విఫలయ్యారన్నారు. సమావేశంలో నాయకులు కురబ నారాయణస్వామి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అనంత రెడ్‌క్రాస్‌కు బంగారు పతకం



రెడ్‌క్రాస్ కార్యాలయం

అనంతపురం టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్‌క్రాస్ సేవలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. సంస్థ 2024-25లో జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టింది. కలెక్టరు వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవచూపారు. రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు, 25కిలో వాట్ల సోలార్ పవర్ సిస్టమ్ ఏర్పాటు, అఫెరిసిస్‌మెషిన్ సమకూర్చడం, ప్లేట్‌లెట్స్ అజిటేటర్స్ స్థాపన, ఆటో ఇమ్యూనో అస్సే అనలైజర్స్ ప్రవేశపెట్టడం, ఐరిట్రీవల్ సెంటర్ ఏర్పాటు వంటి కీలకమైన సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చారు. పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ సేవలను రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు, గవర్నరు అబ్దుల్‌నజీర్ గుర్తించారు. కలెక్టరును రెడ్‌క్రాస్ గోల్డ్‌మెడల్‌కు ఎంపికచేశారు. ఈ అవార్డును గురువారం రాష్ట్రస్థాయిలో జరిగే రెడ్‌క్రాస్ అంతర్జాతీయ దినోత్సవంలో అందుకోవాలని ఆహ్వానం పంపారు. అయితే సీఎం పర్యటన ఏర్పాట్లలో కలెక్టరు బిజీగా ఉన్నందున, మరోసారి గవర్నర్ నుంచి అందుకోనున్నారు.


గోడౌన్‌లో కొత్తపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, మేనేజర్ పావని



1, 2 క్లాసులకు మూడు సబ్జెక్టులు ఒకే పుస్తకంగా కలిపి ముద్రించిన కొత్త బుక్

మారిన పదో తరగతి కొత్త సిలబస్ హిందీ పుస్తకం

9వ తరగతిలో సోషల్ అన్ని విభాగాలూ కలిపి ఒకే పుస్తకంగా..

బడి బ్యాగు..

ఇక.. తేలికే..!

పిల్లలపై భారం తగ్గించేలా విద్యాశాఖ నిర్ణయం

- కొన్ని సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంలో ముద్రణ
- 1, 2 తరగతులకు ఒకే బుక్‌లో మూడు సబ్జెక్టులు
- మారిన 9, 10 క్లాసుల హిందీ సిలబస్
- ఉమ్మడి జిల్లాకు 15.91 లక్షల పాఠ్యపుస్తకాల ఇండెంట్
- జిల్లాకు చేరిన 14.86 లక్షల పుస్తకాలు
- మండల కేంద్రాలకు 9.44 లక్షలు సరఫరా
- స్కూళ్ల ప్రారంభానికి ముందే బుక్స్: డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, మే 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీపికబురు. బడి పిల్లలకు పుస్తకాల మొత తగ్గనుంది. బడి బ్యాగు తేలిక కానుంది. ఆ మేరకు కొత్త పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్. వస్తూ వస్తూ... కొత్త బుక్స్ న్యూలుక్‌తో ఎంట్రీ ఇస్తున్నాయి. బడి పిల్లలపై ఇక బ్యాగులు, పుస్తకాల బరువు ఉండబోదు. 'అయ్యో.. బుడ్డోడా.. ఇన్ని పుస్తకాలు ఎలా మోస్తాడబ్బా.' అంటూ తల్లిదండ్రుల మనసు చిబుకుమనేది. పేరెంట్స్ ఇకపై అలా చింతించాల్సిన పని ఉండదు. బడి పిల్లలపై పుస్తకాలు, బ్యాగుల బరువు తగ్గించాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు కొన్ని సబ్జెక్టులకు ఒకే పుస్తకాన్ని రూపొందించారు. గత పాలకులు ఒక పుస్తకాన్ని రెండు, మూడు సెమిస్టర్లుగా విభజించి, భారీగా ముద్రించి కోట్ల రూపాయలు దోచేశారు. కొత్త ప్రభుత్వం పిల్లలపై భారం ఉండరాదంటూ.. ఒకే పుస్తకంలో రెండు, మూడు సబ్జెక్టులు ముద్రించి, అదనపు భారాన్ని తగ్గించారు. 1 నుంచి పదో తరగతి వరకూ చూసినా... 6 సబ్జెక్టుల పుస్తకాల కంటే ఎక్కువ రావు. గతంలో 14 పుస్తకాలు ఇచ్చిన దాఖలాలున్నాయి. ఈ ఏడాది కొత్త పుస్తకాలు తక్కువ సైజ్‌తో.. ఎక్కువ సౌలభ్యంతో అందించనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు 15.91 లక్షల పాఠ్యపుస్తకాల ఇండెంట్ పంపగా.. ఇప్పటికే 14.86 లక్షలు వచ్చాయి. 51 మండలాలకు 9.44 లక్షల పుస్తకాలను ఇప్పటికే సరఫరా చేశారు.



15.91 లక్షల ఇండెంట్...

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు ఉమ్మడిగా సెమిస్టర్-1 పుస్తకాలు 15.91 లక్షలు కావాలని ప్రింటర్లకు ఇండెంట్ పెట్టారు. జిల్లాలోని గోడౌన్లకు ఇప్పటికే 14.86 లక్షల పుస్తకాలను పంపారు. వాటిని ఆర్టీసీ బస్సుల ద్వారా మండలాలకు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలకుగాను 51 మండలాలకు 9.44 లక్షల పాఠ్యపుస్తకాలను ఇప్పటికే సరఫరా చేశారు. మండలాలకు చేరిన పుస్తకాలను స్కూళ్లకు మండల విద్యాశాఖాధికారులు సరఫరా చేయనున్నారు. మండల పాయింట్ నుంచి స్కూళ్లకు రవాణా చేసేందుకు అయ్యే వ్యయంపై అటు జిల్లా విద్యాశాఖ, ఇటు సమగ్రశిక్ష అధికారులు క్లారిటీ ఇవ్వడం లేదు.

బరువు తగ్గిన బడి పుస్తకం



ప్రభుత్వ బడిపిల్లల పాఠ్యపుస్తకాలు బరువు తగ్గాయి. ఇది అటు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభవార్త అనే చెప్పాలి. రెండు, మూడు సబ్జెక్టులను కలిపి ఒకే పుస్తకంలో ఉండేలా రూపొందించారు. గతంలో కొన్ని క్లాసులకు 10 నుంచి 14 పుస్తకాలను సైతం అందించారు. దీంతో విద్యార్థులు ఆ బరువు మోయలేక ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది వచ్చిన కొత్త పుస్తకాల్లో చాలా క్లాసులకు రెండు, మూడు సబ్జెక్టులను ఒక పుస్తకంగానూ, ఒక సబ్జెక్టుకు ఒక పుస్తకం తీసుకురావంతో ఆ బరువు తగ్గనుంది. ఈ ఏడాది వచ్చే కొత్త పుస్తకాల్లో 9, 10 తరగతుల హిందీ పుస్తకాలు సిలబస్ మారనున్నాయి. 1, 2 క్లాసులకు సంబంధించి తెలుగు, గణితం, ఇంగ్లిష్ (ఒక పుస్తకంగా), 3, 4, 5 తరగతులకు తెలుగు, ఇంగ్లిష్ (ఒక పుస్తకంగా), గణితం, ఈవీఎస్ (ఒక పుస్తకంగా), 6, 7 తరగతులకు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ (ఒక పుస్తకంగా), సోషల్, గణితం, సైన్స్ (విడివిడిగా), 8వ క్లాస్‌కు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ (ఒకటిగా), ఫిజిక్స్, బయాలజీ (ఒకటిగా), సోషల్, గణితం (విడివిడిగా), 9వ క్లాస్‌కు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ (ఒకటిగా), ఫిజిక్స్, బయాలజీ(ఒకటిగా), గణితం, సోషల్ (విడివిడిగా), 10వ క్లాస్‌కు అన్ని సబ్జెక్టులు, వర్క్‌బుక్స్ కలిపి సుమారు 12 అందించనున్నారు.

51 మండలాలకు చేరాయి



కొత్త పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం వేగంగా సరఫరా చేస్తోంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు కలిపి 15.91 లక్షల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ 14.86 లక్షలు చేరాయి. 51 మండలాలకు సరఫరా ప్రారంభమైంది. 90 శాతం పుస్తకాలు జిల్లాకు చేరాయి. పాఠ్యపుస్తకాలతోపాటు ఇతర స్టూడెంట్ కిట్లు సైతం వస్తున్నాయి. స్కూళ్ల రీ ఓపెన్‌కు ముందే విద్యార్థులకు అన్నీ అందుబాటులో ఉంచుతాం.

- ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

విద్యుత్ బిల్లు చెల్లింపు

ఇక సులభతరం..!

క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు..

బిల్లులోనే క్యూఆర్ కోడ్‌ను రూపొందించిన విద్యుత్ సంస్థ



అనంతపురంరూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోయింది. ఈ సాంకేతిక విధానాన్ని వినియోగించుకోవడంలో విద్యుత్ సంస్థ ముందు వరసలో ఉంటోంది. ఈ క్రమంలోనే వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేసేలా చర్యలు చేపట్టింది. విద్యుత్ బిల్లుల చెల్లింపు ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ అడుగులు వేసింది. క్యూఆర్ కోడ్ ద్వారా బిల్లు చెల్లింపు ప్రక్రియను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. వినియోగదారులకు చెల్లించే బిల్లులోనే ఈ క్యూఆర్ కోడ్‌ను రూపొందించింది. ఈ నెల జారీ చేస్తున్న బిల్లుల నుంచి ఈ విధానాన్ని అమలులోకి తీసుకు వచ్చింది.

క్యూఆర్ కోడ్ ద్వారా..

కొన్నేళ్ల కిందట విద్యుత్ శాఖ సిబ్బంది ఇళ్ల వద్దకు వచ్చి బిల్లులు కట్టించుకునేవారు. ఆ తరువాత పెద్ద బుక్కులు తీసుకొచ్చి ఒక చోట కుర్చుని రాతపూర్వకంగా బిల్లులు కట్టించుకుని చిన్న పాటి స్లిప్‌లు వినియోగదారులకు ఇచ్చేవారు. అక్కడి నుంచి మిషన్ల ద్వారా బిల్లులు జారీకి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి కట్టించుకునేవారు. ఇంతలోనే చెల్లింపు కేంద్రాలకు వెళ్లకుండా ఫోన్‌పే, గూగుల్ పే, యూపీఐ తదితరాల ద్వారా చెల్లింపులు ప్రారంభించారు. కొన్ని రోజుల కిందట ఫోన్ పే, గూగుల్ పే ద్వారా చెల్లింపులు నిలిచిపోవడంతో ఆన్‌లైన్‌లోనే సంస్థ వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లింపులు ప్రారంభించింది. ఈ ప్రక్రియతో మొదట్లో వినియోగదారుల కొంత ఇబ్బంది పడ్డారు. ఈ విధానం ద్వారా చెల్లించలేనివారు కార్యాలయాలకు వచ్చి చెల్లిస్తున్నారు. తాజాగా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపు ప్రక్రియను ప్రారంభించింది. ఈనెల జారీ చేస్తున్న విద్యుత్ బిల్లులో ఈ విధానాన్ని తీసుకొచ్చింది. ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ఇతరాత్రవాటి ద్వారా విద్యుత్ బిల్లుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే సంబంధిత వినియోగదారుడి బిల్లులు చూపిస్తుంది. తద్వారా వినియోగదారుడు బిల్లు చెల్లించుకునే వీలు కల్పించారు.

ఆ సర్వీసులకు తప్ప..

జిల్లాలో 10.19 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహ కనెక్షన్లు 7.07 లక్షలు, వ్యవసాయ కనెక్షన్లు 2.06 లక్షలు, వాణిజ్యం, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలు, వీధిదీపాలు ఇతరాత్ర కనెక్షన్లు లక్షకు పైగా ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి 25 వేల కనెక్షన్లు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఈ నూతన విధానం ప్రభుత్వ సర్వీసులకు లేదని తెలుస్తోంది. అదేవిధంగా అరియర్స్, బిల్లు పెండింగ్‌లో ఉన్న వినియోగదారులకు ఈ వెసులుబాటు ఉండదని అధికారులు చెబుతున్నారు. గత నెల బిల్లు చెల్లించకపోయినా ఈ నెల బిల్లులో ఈ క్యూఆర్ కోడ్ కనిపించదని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు.

సేవలను మరింత చేరువ చేసేందుకే..

విద్యుత్ సేవలను వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చాం. ప్రభుత్వ సర్వీసులకు మినహా..ప్రైవేట్ సర్వీసులన్నింటిలోను ప్రక్రియను అందుబాటులోకి తీసుకు వచ్చాం. కొన్ని రోజుల తరువాత వాటికి అమలు చేస్తాం. ఈ విధానం ద్వారా బిల్లులు ఏవిధంగా చెల్లించవచ్చో..వీడియోల ద్వారా ప్రచారం చేస్తున్నాం.

- శేషాద్రి శేఖర్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

సొసైటీలకు

జవసత్వాలు

జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణ



అనంతపురం క్లాక్‌టవర్, మే 7(ఆంధ్రజ్యోతి): సొసైటీలకు జవసత్వాలు ఇవ్వనున్నట్లు జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) అరుణకుమారి తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(పీఏసీఎస్)లను అతి త్వరలో మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్చేందుకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయనీ, దీంతో వాటి స్వరూపమే మారిపోతుందన్న డీసీఓతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ఇంటర్వ్యూ interview

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘాలున్నాయి..?

డీసీఓ: జిల్లాలో 58 సొసైటీలున్నాయి. వీటి ద్వారా రైతులు, ప్రజలకు సేవలు అందిస్తున్నాం.

ప్రశ్న: సొసైటీల కంప్యూటరైజేషన్ ఏ మేరకు పూర్తయింది?

డీసీఓ: జిల్లాలో కంప్యూటరైజేషన్ విజయవంతంగా పూర్తిచేశాం. రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిచాం. ఇక సొసైటీల్లో అన్ని లావాదేవీలు, ఆడిట్ కూడా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ప్రశ్న: మల్టీపర్పస్ క్రెడిట్ సొసైటీలుగా మార్చితే ఉపయోగాలేంటి?

డీసీఓ: సొసైటీలను బలోపేతం చేసి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు, రైతులకు ఇదివరకు పనిచేసిన మీ-సేవ కేంద్రాల తరహాలో అన్నిరకాల సేవలు అందించే అవకాశం ఉంటుంది. మొబైల్ రీచార్జితో మొదలుకుని విద్యుత్తు బిల్లులు, టిక్కెట్ బుకింగ్ ఇలా అనేక రకాల సేవలు సీఎస్‌సీల ద్వారా అందించవచ్చు. రైతులకు తక్కువ ధరకే నాణ్యమైన విత్తనాలు అందించేందుకు సీడ్ సొసైటీ, సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించేందుకు ఆర్గానిక్ సొసైటీ, రైతులు పండించిన పంటలను ఎగుమతి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సొసైటీలతో సహకార సంఘాలను అనుసంధానం చేసి, గోడౌన్లను నిర్మించారు. పేదలకు తక్కువ ధరకే మందులు అందించేందుకు జన ఔషధి పేరుతో జనరిక్ మెడికల్ షాపులు ప్రారంభించనున్నారు. పెట్రోలు బంకులు సైతం ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందజేస్తారా..?

డీసీఓ: ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరికరాలు మల్టీ పర్పస్ క్రెడిట్ సొసైటీల్లో అందుబాటులో ఉంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నామమాత్రపు అద్దెతో వాటిని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం.

డ్రోన్‌సాయం..!

- చీనీకి సాంకేతిక దన్ను
- డ్రోన్ ద్వారా పంటల పర్యవేక్షణ

● చెట్ల ఎదుగుదల, తెగుళ్లపై రైతులకు సూచనలు ● పైలెట్ ప్రాజెక్టుగా ముకుందాపురం ఎంపిక ● ఇప్పటికే సర్వే పూర్తి

అనంతపురం అర్బన్/గార్లదిన్నె, మే 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికత వినియోగానికి నూతన ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తద్వారా అన్నదాతకు అండగా నిలవాలని భావిస్తోంది. వ్యవసాయాన్ని డ్రోన్ సాయంగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లాలో విస్తారంగా సాగవుతున్న ఉద్యాన పంట చీనీ సాగులో సాంకేతికతను వినియోగించేలా చర్యలు చేపడుతోంది. సీజన్ల వారీగా పంటకు సోకే తెగుళ్లపై ముందస్తుగా రైతులకు సంక్షిప్త సమాచారం అందించేందుకు ప్రభుత్వం వినూత్న పద్ధతికి శ్రీకారం చుట్టింది.


గార్లదిన్నె మండలం ముకుందాపురం వద్ద చీనీ తోటలో జీపీఎస్ ట్రాకింగ్‌ను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ డీడీ ఫిరోజ్ ఖాన్, హెచ్‌ఓ రత్నకుమార్

పైలెట్ ప్రాజెక్టుగా ముకుందాపురం

జిల్లావ్యాప్తంగా 95వేల ఎకరాల్లో చీనీ సాగు చేస్తున్నారు. గార్లదిన్నె మండలంలోనే 22 వేల ఎకరాల్లో పంట సాగవుతోంది. మండలంలోని ముకుందాపురానికి చెందిన 1,711 మంది రైతులు 4,830 ఎకరాల్లో చీనీ పంట పెట్టారు. రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషన్ ఆదేశాల మేరకు అత్యధికంగా చీనీ పంట సాగులో ఉన్న ముకుందాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. మూడు రోజులపాటు 34 బృందాలతో జియోకోఆర్డినేటర్ల ద్వారా సర్వే చేశారు. ఒక్కో బృందంలో వీహెచ్‌ఏ, ఎఫ్‌సీఓలు పనిచేశారు. గ్రామంలోని చీనీ తోటలను ఉద్యాన, ఏపీఎంఐపీ అధికారులు, సిబ్బంది జీపీఎస్ సర్వే చేశారు. ముకుందాపురం గ్రామంలోని 1,355 మంది రైతులకు సంబంధించి 4,247 ఎకరాల్లో జీపీఎస్ ట్రాకింగ్ చేసి, చీనీ తోటలకు సంబంధించి పాలిగాన్ మ్యాప్‌లు రూపొందించారు. ఆ మ్యాప్‌లను ఉద్యాన శాఖ కమిషనరేట్‌కు పంపించారు. హైదరాబాద్‌కు చెందిన 3 ఎఫ్ (ఫుడ్, ప్యాట్, ఫర్టిలైజర్) కంపెనీ సాంకేతిక సహకారంతో జీపీఎస్ ట్రాకింగ్ ఆధారంగా డ్రోన్ ద్వారా మూడురోజులపాటు ముకుందాపురం గ్రామంలోని చీనీ తోటలపై సర్వే చేశారు. పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే అన్ని రకాల ఉద్యాన పంటలకు డ్రోన్ సర్వే చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యాన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


పంటలో డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్)

డ్రోన్లతో పర్యవేక్షణ

చీనీ పంట తెగుళ్ల బారిన పడుతుండడంతో చెట్లు దెబ్బతిని, దిగుబడులు తగ్గుతున్నాయి. తద్వారా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ క్రమంలో సాంకేతికత సాయంతో పంట ఆరోగ్యాన్ని అంచనా వేయడంతోపాటు తెగుళ్లపై పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఇన్‌ఫ్రారెడ్, మల్టీస్పెక్ట్రల్ కెమెరాలతో కూడిన డ్రోన్ సర్వే ద్వారా ఉద్యాన పంటల్లో పోషక లోపాలు, నీటి ఒత్తిడి, తెగుళ్ల బెడద తదితర సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తిస్తారు. దాని ఆధారంగా పంటకు సోకిన తెగుళ్లు, ఇతర దుష్ప్రభావాల నివారణకు ముందస్తుగానే రైతులకు సమాచారం ఇవ్వనున్నారు. కచ్చితమైన జీపీఎస్ మ్యాపింగ్ ద్వారా ఈ ప్రక్రియను చేపట్టినట్లు ఉద్యాన అధికారులు పేర్కొంటున్నారు. డ్రోన్ సర్వే ద్వారా నేలలో తేమ, మొక్కల ఆరోగ్యం, కలుపు మొక్కల వృద్ధిని క్షేత్ర పరిస్థితులకు సంబంధించి వివరణాత్మక చిత్రాలను రూపొందిస్తారు.



చీనీ తోటలో జీపీఎస్ ట్రాకింగ్‌పై శిక్షణ ఇస్తున్న అధికారులు

డ్రోన్ సర్వే ద్వారా చాలా ఉపయోగాలున్నాయి. ప్రాథమిక దశలోనే పంటలకు సోకే తెగుళ్లను గుర్తించడం ద్వారా అనవసరంగా పురుగు మందుల వాడకాన్ని తగ్గించవచ్చు.

ఉపయోగాలు..

పంటలకు సోకే తెగుళ్లతోపాటు నేలలో తేమ శాతాన్ని గుర్తిస్తుంది. తద్వారా నీటి వృథాను తగ్గించవచ్చు. డ్రోన్ల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా పంటలకు నష్టం వాటిల్లినపుడు పంటల బీమా, పంటనష్ట పరిహారం అందించే అవకాశం ఉంటుంది. తెగుళ్ల నివారణకు పిచికారీ చేసుకోవాల్సిన పురుగుమందులతోపాటు ఏయే రకాల ఎరువులు వాడితే పంట ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్న సమగ్ర సమాచారాన్ని అందిస్తారు. పంట నిర్వహణకు రైతులకు సకాలంలో కచ్చితమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది.

రైతులకు చాలా ఉపయోగం



రాష్ట్ర ఉద్యాన శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అత్యధికంగా చీనీ సాగవుతున్న ముకుందాపురం గ్రామాన్ని ఎంపిక చేశాం. గ్రామంలో చీనీ సాగు చేసే రైతులకు సంబంధించిన పొలాన్ని నాలుగు దిక్కులా జీపీఎస్ ద్వారా సర్వే చేసి, పాలిగాన్ మ్యాప్‌లు తయారు చేశాం. తోట ఎలా ఉంటే పాలిగాన్ మ్యాప్‌లు అలాగే ఉంటాయి. ఇందులో రైతు పేరు, సర్వే, ఖాతా నంబర్లతోపాటు ఎంత విస్తీర్ణంలో చీనీ సాగు చేశారన్న వివరాలు ఉంటాయి. పైలెట్ ప్రాజెక్టు కింద ప్రీ కౌంట్-ప్రీ హెల్త్ నినాదంతో హైదరాబాద్‌కు చెందిన 3 ఎఫ్ (ఫుడ్, ప్యాట్, ఫర్టిలైజర్) కంపెనీ సాంకేతిక సహకారంతో డ్రోన్ సర్వే పూర్తి చేశాం. తొలి విడతలో ముకుందాపురం గ్రామంలోని 1,355 మంది రైతులకు సంబంధించి 4,247 ఎకరాల్లో జీపీఎస్ ట్రాకింగ్ చేసి, తోటలకు సంబంధించిన పాలిగాన్ మ్యాప్‌లు రూపొందించాం. ఉద్యాన శాఖ కమిషనరేట్‌కు పంపించాం. ఆయా రైతుల చీనీ తోటలకు సంబంధించిన జీపీఎస్ కోఆర్డినేట్లను శాటిలైట్‌కు అనుసంధానం చేస్తారు. డ్రోన్ సర్వే ద్వారా చీనీ తోటలకు సోకిన పలు రకాల చీడపీడలు, తెగుళ్లపై ఆర్ఎన్‌డీ సంస్థ ద్వారా రైతుల సెల్‌ఫోన్‌కు సంక్షిప్త సమాచారంతో డ్రోన్ అలర్ట్ వెళ్తుంది. తద్వారా ఏయే రకాల తెగుళ్ల సోకాయి..? అందుకు ఏ మందులు పిచికారీ చేసుకోవాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పించవచ్చు.

- ఫిరోజ్‌ఖాన్, ఉద్యాన శాఖ డీడీ


డ్రోన్ ద్వారా తీసిన ఫొటో

కొత్త రేషన్‌కార్డులకు ఓకే

మార్పుచేర్పులకు అవకాశం

గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ


జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయం

అనంతపురంటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొన్నేళ్లుగా అర్హత ఉండి రేషన్‌కార్డు కోసం అనేకమంది ఎదురుచూస్తున్నారు. రేషన్ కార్డుల్లో తప్పులను సవరించుకునేందుకు, అడ్రస్ మార్పు, కుటుంబసభ్యులను కార్డులో నమోదు చేయించుకునేందుకు వేలాదిమంది లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఈ ఆప్షన్లను గత వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక అర్హులందరికీ కొత్తరేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించింది. కొన్ని నెలలుగా అదిగో.. ఇదిగో.. అంటూ ప్రచారం సాగుతూ వచ్చింది. ఎట్టకేలకు కొత్తరేషన్ కార్డుల జారీకి సర్కారు సై అంది. ఆ మేరకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

దరఖాస్తులు ప్రారంభం

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల పక్రియ బుధవారం నుంచే మొదలు పెట్టారు. జిల్లాలో ఇప్పటివరకు అధికారిక లెక్కల మేరకు 6.60లక్షల రేషన్‌కార్డులున్నాయి. వీటిలోని లబ్ధిదారుల్లో చాలామంది చనిపోయారు. ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయినోళ్లు ఉన్నారు. వివాహమైన వారు, పేర్లు తప్పుగా నమోదైనోళ్లు ఉన్నారు. వీరందరూ కొత్తకార్డులతోపాటు మార్పుచేర్పులు చేసుకునేందుకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్కడకు వెళ్లినా వినతులు ఇస్తున్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలోనూ అధికార యంత్రాంగానికి అర్జీలు సమర్పిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ వర్గాలు చెబుతున్న సమాచారం మేరకు 50వేలకుపైగా వినతులు ఉంటాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడంతో అవన్నీ కార్యాలయాలకే పరిమితమమయ్యాయి. ప్రస్తుతం సర్కారు సై అనడంతో వీరందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్త రేషన్ కార్డు, కుటుంబసభ్యుల విభజన, పాతకార్డులో పేర్ల నమోదు, చిరునామాల మార్పు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందజేయవచ్చు.

ఉత్తర్వులు వచ్చాయి

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు స్వీకరించడానికి రాష్ట్ర కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. మార్పుచేర్పులకు అవకాశం కల్పించారు. ఈ పక్రియ బుధవారమే ప్రారంభమైంది. సోమవారం నుంచి వాట్సాప్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

-జగన్నాథరావు, ఇన్‌చార్జి డీఎస్ఓ

హెలీప్యాడ్ వద్ద ఏం జరిగింది?

● వైసీపీ నాయకులను విచారించిన పోలీసులు



విచారణకు హాజరైన వైసీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, మే 7 (ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్ పర్యటన సందర్భంగా కుంటిమద్ది హెలీప్యాడ్ వద్ద మీరు ఉన్నారా? అక్కడ ఏం జరిగింది?' అంటూ రామగిరి సీఐ శ్రీధర్.. వైసీపీ నాయకులపై ప్రశ్నల వర్షం కురిపించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో బుధవారం 23 మంది వైసీపీ నేతలు ఒక్కొక్కరిని వేర్వేరుగా విచారించారు. అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని వారికి సీఐ తెలిపారు. విచారణకు హాజరైన వారిలో చెన్నేకొత్తపల్లి మండలం నుంచి ముగ్గురు, రాప్తాడు నుంచి ఒకరు, కనగానపల్లి నుంచి 19 మంది ఉన్నారు. వారిలో వైసీపీ రాప్తాడు మండల కన్వీనర్ సాకే వెంకటేశ్, కనగానపల్లి జడ్పీటీసీ మారుతీప్రసాద్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు. ఇప్పటివరకు మొత్తం 41 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు.. పోలీసు విచారణకు హాజరయ్యారు.

ఎస్కేయూ బీఈడీలో 86 శాతం పాస్

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఈడీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షల్లో 86శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు బుధవారం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత తన కార్యాలయంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబుతో కలిసి బీఈడీ, ఎంబీఏ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. అనంతరం వీసీ అనిత మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో నిర్వహించిన బీఈడీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షలకు 735 మంది విద్యార్థులకుగాను 639మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. దీంతో ఉత్తీర్ణత శాతం 86.94గా నమోదైందన్నారు. ఎంబీఏ జనరల్ కోర్సు పరీక్షల్లో 1,455 మందికిగాను 1,143 మంది, ఫైన్ ఆర్ట్స్ పరీక్షల్లో 56 మందికిగాను 51 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్‌లో ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్, ఏఆర్ శంకర్, సూపరింటెండెంట్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

డీఎస్సీ క్రాష్ కోర్సుపై ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు డీఎస్సీ క్రాష్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బుధవారం విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాకులు వినోద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెగా డీఎస్సీకి ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న దృష్టి, వినికిడి లోపం, ఆర్థోపెడిక్ మొదలగు విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులు అర్హులన్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణకు ఈనెల 11వరకు https://mdfc.apcfss.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక బోధనాశిక్షణ, స్టడీ మెటీరియల్, భోజన, వసతి సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారన్నారు.

వైస్ సర్పంచ్‌కు 14 రోజుల రిమాండ్

పెనుకొండ రూరల్ మే 7(ఆంధ్రజ్యోతి): స్థలం విషయంలో మునిమడుగు పంచాయతీ అమ్మవారిపల్లికి చెందిన వైస్ సర్పంచ్ వెంకటరెడ్డి తనను అసభ్యకరంగా దూషించి, దాడి చేశాడని ధరణి అనే మహిళ కియ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి, వైసీపీ వైస్ సర్పంచ్‌ను బుధవారం కోర్టులో హాజరుపర్చారు. ఈ నేపథ్యంలో పెనుకొండ మెజిస్ట్రేట్ వెంకటరెడ్డికి 14 రోజుల రిమాండ్ విధించారు.

కాలువ వెడల్పుతోనే ప్రయోజనం: ఎమ్మెల్సీ

విడపనకల్లు, మే 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని అనంతపురం, చిత్తూరు, జిల్లాలకు సాగు, తాగు నీరు కావాలంటే హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పేర్కొన్నారు. వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలో గల తన గృహంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువను 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో తవ్వితే 2200 క్యూసెక్కులు మాత్రమే పారిస్తున్నారన్నారు. 10వేల క్యూసెక్కులు పారేలా పనులు చేపట్టాలన్నారు. అధికంగా వచ్చే నీటిని నిల్వ చేసుకునేందుకు జీడిపల్లి రిజార్వాయర్ సామర్థ్యాన్ని 4 టీఎంసీలకు పెంచాలని కోరారు. ప్రభుత్వం.. రాయలసీమకు న్యాయం చేయాలంటే కాలువను వెడల్పు చేయడంతోపాటు జీడిపల్లి రిజార్వాయర్ నిలువ సామర్థ్యాన్ని పెంచాలని ఆయన అభిప్రాయపడ్డారు.

చెక్‌బౌన్స్ కేసులో టీచర్‌కు జైలుశిక్ష

హిందూపురం, మే 7(ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఉపాధ్యాయురాలికి మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ హిందూపురంలోని ప్రత్యేక కోర్టు న్యాయాధికారి రమణయ్య బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రస్తుతం లేపాక్షి మండలం మైదుగోళం ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సత్యవతి హిందూపురానికి చెందిన నేత్రావతి వద్ద రూ.3లక్షలు అప్పు తీసుకుంది. డబ్బు తిరిగి చెల్లించడానికి చెక్కు ఇచ్చింది. అది బ్యాంక్‌కు కలెక్షన్ కోసం వెళ్లగా బౌన్స్ అయింది. దీంతో బాధితురాలు నేత్రావతి కోర్టుకు వెళ్లింది. విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయాధికారి ఉపాధ్యాయురాలు సత్యవతికి మూడునెలల జైలుశిక్ష, రూ.3లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు బాధితురాలు నేత్రావతి తరఫు న్యాయవాది సంపత్‌కుమార్ తెలిపారు.

15 మంది ఎంపీడీఓలకు పోస్టింగ్

అనంతపురం విద్య/న్యూటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు చెందిన 15 మంది ఎంపీడీఓలకు బుధవారం ప్లేస్ పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందించారు. గత నెల 25న రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఈఓఆర్డీలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు తాత్కాలిక ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. కొత్త ఎంపీడీఓలకు ప్లేస్‌లు కేటాయించారు.

పేరు	కేటాయించిన ప్లేసు
ధనుంజయ	కళ్యాణదుర్గం
విజయసింహారెడ్డి	బ్రహ్మసముద్రం
సూర్యనారాయణ	కంబదూరు
శివాజీరెడ్డి	వజ్రకరూరు
జిలానీబాషా	శెట్టూరు
రెడ్డెప్ప	పరిగి
పార్థసారధి	ఎన్పీకుంట
కరుణసాగర్	చిలమత్తూరు
బాలకృష్ణుడు	నీకేపల్లి
నాగేశ్వర్‌శాస్త్రి	రొళ్ల
వెంకటలక్ష్మమ్మ	సోమందేపల్లి
కేశవరెడ్డి	గుడిబండ
నసీమా	తలుపుల
మమతాదేవి	తనకల్లు
నటరాజ్	కొత్తచెరువు

ప్రాణాలు తీసిన సెలవులు

● పీబీసీలో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి
● కాపాడే ప్రయత్నంలో నాన్నమ్మ కూడా..



లిదియా, జాషువా, నాగలక్ష్మమ్మ (ఫైల్)

తాడిపత్రి/యల్లనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో నాన్నమ్మ వద్ద సంతోషంగా గడపాలని వెళ్లిన ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయారు. వారిని కాపాడే ప్రయత్నంలో నాన్నమ్మ కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన యల్లనూరు మండలం కల్లూరులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగలక్ష్మమ్మ(61), ఆమె మనవరాలు లిదియా(12), మనవడు జాషువా(10) పులివెందుల బ్రాంచ్ కెనాల్‌లో మునిగి మృతిచెందారు. కల్లూరుకు చెందిన శ్రీనివాసులు, శాంతమ్మ దంపతులు బతుకుదెరువు కోసం తాడిపత్రికి వచ్చారు. శ్రీనివాసులు ఇంటిపట్టునే ఉంటూ వారి పిల్లలు లిదియా, జాషువాను చూసుకునేవాడు. శాంతమ్మ శింగనమలలోని పశువైద్యశాలలో పనిచేస్తోంది. తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో లిదియా 5, జాషువా 3వ తరగతి చదువుతున్నారు. వేసవి సెలవులు రావడంతో తల్లిదండ్రులు కల్లూరులోని వారి నాన్నమ్మ నాగలక్ష్మమ్మ వద్దకు పిల్లలను పంపించారు. నాగలక్ష్మమ్మ దుస్తులు ఉతికేందుకు బుధవారం ఉదయం గ్రామ శివారులో ఉన్న పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) వద్దకు వెళ్లింది. ఆ తరువాత కాసేపటికి మనవడు, మనవరాలు నానమ్మ వద్దకు వెళ్లారు. అక్కడ ఉతికిన దుస్తులను బయటకు తీసుకువచ్చే సమయంలో జాషువా కాలుజారి కాలువలో పడిపోయాడు. తమ్ముణ్ని రక్షించేందుకు చేయి అందించిన లిదియా కూడా కాలువలో పడిపోయింది. ఇది చూసిన నాగలక్ష్మమ్మ వారిని కాపాడేందుకు కాలువలో దూకింది. ఆమెకు ఈత వచ్చినా, చిన్నారులిద్దరూ భయంతో ఆమెను పట్టుకోవడంతో ప్రవాహ వేగానికి ముగ్గురూ మునిగిపోయారు. అక్కడే దుస్తులు ఉతుకుతున్న గ్రామస్థులు వారిని రక్షించే ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. ఒడ్డుకు చేర్చేలోగా ముగ్గురూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న చిన్నారుల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలాన్ని తహసీల్దారు శేషారెడ్డి, ఎస్ఐ రామాంజనేయరెడ్డి, ఏఎస్ఐ సంపత్ తదితరులు పరిశీలించారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలి

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వినతి



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

అనంతపురం మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ కింద విదేశాల నుంచి అందే సాయానికి సంబంధించి రెన్యువల్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ మేరకు బుధవారం ఎస్కేయూనివర్సిటీ పూర్వ విద్యార్థులు కృష్ణయ్య తదితరులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను ఆయన కార్యాలయంలో రామకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీటీకి విదేశీ సాయం అందే విషయంపై చర్చించారు. 1969లో అనంతపురం జిల్లాలో ఆర్డీటీ సంస్థను విన్సెంట్ ఫెర్రర్, అన్నే ఫెర్రర్ దంపతులు స్థాపించారన్నారు. సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేదరికం, బాధలు, అన్యాయాలను నిర్మూలించేందుకు, సమాన అవకాశాలు, సంపదను అందరికి పంచడానికి కృషి చేస్తున్నా రని తెలిపారు. వేలాదిగా బావులు తవ్వించడంతోపాటు లక్షలాది గృహాలను నిర్మించారన్నారు. కుష్ఠువ్యాధి నిర్మూలన కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కూలీలను సైతం రైతులుగా మార్చడంలో ఆ సంస్థ కృషి ఎంతో ఉందన్నారు. విద్యా, వైద్యం, గృహ నిర్మాణం, స్థిరమైన జీవనోపాధి, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల ద్వారా పేదల అభ్యున్నతికి ఆ సంస్థ కృషి చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సదుపాయాలను కల్పించేందుకు మొబైల్ లైబ్రరీలు, ట్యూషన్లు ఏర్పాటు చేయడంతోపాటు స్కాలర్‌షిప్‌లు అందించిందన్నారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లులో ఆస్పత్రులను ఏర్పాటు చేసి, రోజుకు 3వేల మందికిపైగా పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలే పరమావధిగా పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్న ఆర్డీటీకి విదేశీ సహకారం నియంత్రణ చట్టం లైసెన్స్‌ను పునరుద్ధరిచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రప్రభుత్వం తరపున కేంద్రాన్ని కోరాలని రామకృష్ణ సీఎస్‌కు విజ్ఞప్తి చేశారు.

వాతావరణానికి అనుగుణంగా సాగు

● ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ సంచాలకులు

బుక్కరాయసముద్రం, మే7(ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల వేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని రేకలకుంటలోని ఆచార్య ఎన్జీరంగా మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం అత్యల్ప వర్షపాత మండల పరిశోధన, విస్తరణ సలహామండలి సమావే శం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, ప్రాంతీయ పరిశోధన సంచాలకులు జాన్సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రానున్న ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు సాగు చేసే పంటలు, వర్షపాతం నమోదు ఆధారంగా రైతులు ఏ పంటలు సాగుచేయాలో తదితర అంశాలపై చర్చించారు. డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రాంతాల వారిగా రైతులు సాగుచేసే పంటలను తొలు త గుర్తించాలన్నారు. అనంతరం ఆయా ప్రాంతాలలో కురిసిన వర్షపాతం, వాతావరణం అనుగుణంగా పంటల సాగుపై పరిశోధనలు చేసి రైతులకు పంటల సాగుపై ప్రణాళికను ముందుస్తుగా తెలియజేయాలన్నారు. వర్షాకాలంలో ఎక్కువ వర్షం కురిసే ప్రాంతాల్లో నీటిని నిల్వ చేసే పంటలు, తక్కువ వర్షం కురిసే ప్రాంతాల్లో కరువును తట్టుకునే పంటలను రైతులు సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణం అనుగుణంగా పంటలు వేయడం వలన పంట దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ మార్గాలను, నేల, నీటి సంరక్షణపై రైతులు అవగాహన చేసుకోవాల్సి అవశ్యకత ఉందన్నారు. రైతుల వ్యవసాయంలో సాంకేతిక అందిపుచ్చుకోవాల న్నారు. కార్యక్రమంలో మహానంది అగ్రికల్చర్ డీన్ విజయలక్ష్మి, రాయలసీమ జిల్లాల అగ్రికల్చర్ అధికారులు ఉమా మహేశ్వరమ్మ, సుబ్బారావు, మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్, వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

స్టేట్‌లో మన విద్యార్థుల సత్తా

● ఉమ్మడి జిల్లా విద్యార్థులకు రాష్ట్ర ర్యాంకులు
● ఉత్తమ మార్కులు వచ్చిన వారికి టాప్ 10లో చోటు
● టెన్త్, ఇంటర్ విద్యార్థుల ఎంపిక
● ఉమ్మడి జిల్లాలో 19 మంది..
● ఇద్దరు టీచర్లకు 'బెస్ట్' గుర్తింపు

అనంతపురం విద్య/కొత్తచెరువు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్టేట్ టాపర్ల జాబితాలో చోటు దక్కింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు టాప్ 10లో చోటు కల్పించారు. స్టేట్ ర్యాంకింగ్ అవార్డుల జాబితాలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలు వెల్ఫేర్ స్కూళ్లు, రెసిడెన్షియల్, గురుకులాల్లో చదివే విద్యార్థులు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా పలు మేనేజ్‌మెంట్ హాస్టళ్లు, స్కూళ్లలో చదివిన 19 మంది విద్యార్థులు స్టేట్ ర్యాంకర్లుగా, సిల్వర్ ర్యాంకర్లుగా ఎంపిక అయ్యారు. ఉత్తమ బోధన అందించి మంచి ఫలితాలు సాధించిన టీచర్లు, ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లను సైతం ఎంపిక చేశారు. అయితే టీచర్ల కేటగిరీలో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ మేనేజ్‌మెంట్‌లో అనంతపురం జిల్లా కణేకల్లు జువాలజీ టీచర్ రమా నాయక్‌ను, ఉరవకొండ స్కూల్ ఎకనామిక్స్ టీచర్ సరస్వతిని మెరిటోరియస్ టీచర్లుగా గుర్తించారు. ఉత్తమ ర్యాంకులు పొందిన 19 మంది విద్యార్థుల వివరాలు ఇలా....

ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ మేనేజ్‌మెంట్‌లో...				
విద్యార్థి పేరు	మార్కులు	ర్యాంకు	స్కూల్	జిల్లా పేరు
1.పూజశ్రీ	587	4వ ర్యాంకు	హిందూపురం స్కూల్	శ్రీసత్యసాయి
2.వరుణ్ ఆదిత్యా	587	4వర్యాంకు	కాళసముద్రంస్కూల్	శ్రీసత్యసాయి
3.కావ్యశ్రీ	586	5వ ర్యాంకు	గుత్తిస్కూల్	అనంతపురం
4.తరుణ్ నాయక్	582	8వ ర్యాంకు	హిందూపురం బాయ్స్	శ్రీసత్యసాయి
5.భానుప్రసాద్	582	9వ ర్యాంకు	రొళ్ల	శ్రీసత్యసాయి
6. కీర్తన	581	10వర్యాంకు	హిందూపురం	శ్రీసత్యసాయి
7.పవిత్ర	581	10వ ర్యాంకు	హిందూపురం	శ్రీసత్యసాయి
8. మధులత	580	సిల్వర్ ర్యాంకర్	నల్లమాడ	శ్రీసత్యసాయి
ఇంటర్ కోర్సుల్లో....				
9.గ్రీష్మ	985(బైపీసీ)	2వర్యాంకు	కురుకుంట	అనంతపురం
10.సుచిత్ర	957(సీఈసీ)	2వర్యాంకు	కురుగుంట	అనంతపురం
11. రమణి	982(ఎంపీసీ)	సిల్వర్ ర్యాంకర్	కురుగుంట	ఉమ్మడి అనంతపురం జిల్లా
12.చైతన్య	982(బైపీసీ)	సిల్వర్ ర్యాంకర్	కురుగుంట	ఉమ్మడి అనంతపురం జిల్లా
13.రాణి	969	సిల్వర్ ర్యాంకర్	తనకల్లు	ఉమ్మడి అనంతపురం జిల్లా
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో...				
14. వెంకటేష్ నాయక్	564		నల్లమాడ పాఠశాల	శ్రీసత్యసాయి
ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్				
15.సాకే సంతోష్	583		గొల్లలదొడ్డి	అనంతపురం
16.చామంతి	982(బైపీసీ)		తనకల్లు	శ్రీసత్యసాయి
17.మహేంద్ర నాయక్	555	సిల్వర్ ర్యాంకర్	కదిరి	ఉమ్మడి అనంతపురం జిల్లా
సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లలో...				
18.అజిత్‌కుమార్	570మార్కులు	సిల్వర్ ర్యాంకర్	ఓడీచెరువు	ఉమ్మడి అనంతపురం జిల్లా
19.జనవి	945	సిల్వర్ ర్యాంకర్	హిందూపురం	ఉమ్మడి అనంతపురం జిల్లా

ఆపద వేళ.. రక్షణ ఇలా..!

జిల్లావ్యాప్తంగా మాక్‌డ్రిల్



సత్యసాయి ఎయిర్ పోర్టులో పోలీసుల మాక్‌డ్రిల్

పుట్టపర్తిరూరల్/హిందూపురం/చెన్నేకొత్తపల్లి/కనగానపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఉగ్రదాడులు, ఇతర ప్రమాద సమయాల్లో ఎలా రక్షణ పొందాలన్న అంశాలపై జిల్లావ్యాప్తంగా పోలీసులు బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. పుట్టపర్తిలోని సత్యసాయి విమానాశ్రయంలో పోలీసులు చేపట్టిన మాక్‌డ్రిల్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న పర్యవేక్షించారు. ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినపుడు తక్షణం తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, సైరన్లు మోగినపుడు ఎలా స్పందించాలి, రక్షణకోసం ఎలాంటి చర్యలు చేపట్టాలనే విషయాలపై స్పెషల్‌పార్టీ పోలీసులు, బాంబ్‌స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, ఫైర్, హెల్త్‌సిబ్బంది, చేపట్టే చర్యలను మాక్‌డ్రిల్‌లో వివరించారు. ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పించాలి, ఆపద అనంతరం వారిని హాస్పిటల్‌కు ఎలా తరలించాలి, బాంబులు అమర్చిన ప్రాంతాలను డాగ్‌స్క్వాడ్ ద్వారా గుర్తించి వాటిని ఎలా డిస్పోజల్ చేయాలి అనే విషయాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు.

హిందూపురంలో..



హిందూపురం కూరగాయల మార్కెట్‌వద్ద అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ, సీఐలు

పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. బాంబులు వేస్తే ఆ శబ్దానికి ఎలా ఉండాలనే దానిపై ప్రజలకు వివరించారు. డీఎస్పీ మహేష్, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లిలో రామగిరి సీఐ శ్రీధర్, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ చేపట్టారు.

ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత ఆర్మీ.. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడంపై కనగానపల్లిలో అధికారులు.. ప్రజలతో కలిసి మానవహారంగా ఏర్పడి సైన్యానికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, సీఎస్‌డీటీ కవిత, ఆర్ఐ సరళ పాల్గొన్నారు.

భారత్ దెబ్బ ఎలా ఉంటుందో చూపించారు

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ దెబ్బ ఎలా ఉంటుందో పాకిస్థాన్‌కు చూపించారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో గర్వంగా ఉందన్నారు. పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం చేసిన ఈ ఆపరేషన్ దేశ ప్రజల గుండెల్లో ధైర్యాన్ని నింపిందన్నారు. నిత్యం ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ ఎంతో మందిని భారత్ మీదకు ఉసిగొల్పి పాకిస్థాన్ నరమేధాన్ని సృష్టిస్తోందన్నారు. అందుకే ప్రధాని మోదీ ఈ కఠిన నిర్ణయాన్ని తీసుకోవడాన్ని దేశ ప్రజలంతా స్వాగతిస్తున్నారన్నారు.

బీజేపీ సంబరాలు



స్వీట్లు పంచుకుంటున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ అపరేషన్ సిందూర్ చేపట్టడం హర్షణీయమని బీజేపీ నాయకులు అన్నారు. నగరంలోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అధ్యక్షతన బుధవారం సంబరాలు నిర్వహించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్, బీజేపీ సీనియర్ నాయకులు సందిరెడ్డి శ్రీనివాసులు, రత్నమయ్య, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారత సైన్యం ఉగ్రవాదాన్ని అంతమొదించి, ప్రజలకు అండగా నిలుస్తుందని అన్నారు.

భారత ఆర్మీకి సెల్యూట్: రఘువీరా



రఘువీరా ఆధ్వర్యంలో ర్యాలీ

మడకశిర రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ తీవ్రవాద శిబిరాలపై విజయవంతంగా దాడులు నిర్వహించిన భారత ఆర్మీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి సెల్యూట్ చేశారు. భారత ఆర్మీకి మద్దతుగా తన స్వగ్రామం నీకంఠాపురంలో బుధవారం గ్రామస్థులతో కలిసి మూడు రంగుల జెండా పట్టుకొని జై జవాన్, జై కిసాన్ అని నినదిస్తూ ర్యాలీ నిర్వహించి, సైనికులకు మద్దతు తెలిపారు. అనంతరం నీలకంఠేశ్వరుడి ఆలయ యాగశాలలో శత్రునాశన హోమం నిర్వహించారు

న్యూస్ బాక్స్

ఘనంగా ముత్యాలమ్మ జాతర



ముత్యాలమ్మ దేవతను ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్థులు

రామగిరి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం ముత్యాలమ్మ దేవత జాతరను ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారిని రామగిరి ఆడపడచుగా కొలుస్తారు. ప్రతిఏడాది అమ్మవారిని గ్రామానికి తీసుకొచ్చి నర్రా కుటుంబానికి చెందిన వారు వడిబియ్యం ఇచ్చి సాగనంపుతారు. మంగళవారం సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా గ్రామానికి తీసుకొచ్చారు. బుధవారం గ్రామంలో ఊరేగించారు. గ్రామంలో ఇంటింటి వద్ద అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. అమ్మవారి జాతరకు వచ్చిన బంధువులు, స్నేహితులతో గ్రామం కిటకిటలాడింది.

విగ్రహ ప్రతిష్ఠ

చెన్నేకొత్తపల్లి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్దుర్తి గ్రామంలో ముత్యాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

రామాలయం నిర్మాణానికి విరాళం

అనంతపురం రూరల్, మే7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.నారాయణపురంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి టీడీపీ రాష్ట్ర నాయకులు రాయల్ మురళి, ఆయనసోదరుడు శ్రీనివాసులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. వారి తండ్రి పెద్ద చెన్నమయ్య జ్ఞాపకార్థం మంగళవారం ఆలయ ధర్మకర్తలకు విరాళం నగదు అందజేశారు.

నేడు ప్రత్యేక ఆధార్ క్యాంపులు

అనంతపురం రూరల్, మే7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యేడు, ఆలమూరు, అక్కంపల్లి, కామారుపల్లిల్లో బుధవారం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. అలాగే ఈ నెల 12న చియ్యేడు, మన్నీల, అక్కంపల్లి, కందుకూరు-1 సచివాలయాలు, 13న పూలకుంట, మన్నీల, ఆకుతోటపల్లి-1, కందుకూరు-1, 14న పూలకుంట, సోమలదొడ్డి, ఆకుతోటపల్లి-2, కందుకూరు-2, 15న తాటిచెర్ల, సోమలదొడ్డి, ఇటుకలపల్లి, కందుకూరు-2 సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు. మండలంలోని ప్రజలు ఈ క్యాంపుల ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

నేడు స్త్రీనిధి చెక్కుల పంపిణీ

రామగిరి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగు కార్యాలయ ఆధ్వర్యంలో గురువారం స్త్రీనిధి చెక్కుల పంపిణీ చేపట్టనున్నట్టు ఏపీఎం వెంకటప్ప బుధవారం ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పరిటాలసునీత చేతులమీదుగా రూ.3.50 కోట్ల స్త్రీనిధి చెక్కులు అందించనున్నట్టు ఆయన తెలిపారు. ఉదయం 10గంటలు జరిగే పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతారని ఆయన తెలిపారు.

పీఆర్ సబ్‌డివిజన్-2 ఇన్‌చార్జి డీఈగా కృష్ణజ్యోతి

అనంతపురం న్యూటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ సబ్‌డివిజన్-2 శింగనమల నియోజవర్గం ఇన్‌చార్జ్ డీఈగా కృష్ణజ్యోతిని నియమిస్తూ ఆ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ బాబునాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం బాధ్యతలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

సత్యసాయి జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి



సత్యసాయి చిత్రపటానికి పూజలు చేస్తున్న భట్రాజు సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి): సత్య సాయి బాబా శతజయంతిని పురస్కరించుకుని నవంబరు 23వ తేదీని జాతీయ సెలవుదినంగా ప్రకటించాలని ఉమ్మడి అనంతపు రం జిల్లా భట్రాజు సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కిరాజు నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక రాజు ఫ్లెక్స్ కార్యాలయంలో బుధవారం సత్యసాయిబాబా చిత్రపటానికి పూజలు నిర్వహించి న అనంతరం అక్కిరాజు నాగరాజు మాట్లాడారు. సత్యసాయి బాబా శతజయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుతోపాటు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బరాజు వెంకటనా రాయణ రాజు, సుధాకరరాజు, గోవిందరాజు పాల్గొన్నారు.

10న క్రికెట్ టోర్నీ

నార్పల, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 10న వెంకట్ వకుళ ఫౌండేషన్ చాంపియన్ షిప్ కప్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్నట్లు ఆ ఫౌండేషన్ చైర్మన్ ఆలం వెంకట నరసానాయుడు పేర్కొన్నారు. ఆయన బుధవారం టోర్నమెంట్ పోస్టర్లను ఆవిష్కరించారు. విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.25వేలు అందజేస్తామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుధాకర్, చంద్రబాబు, నడిమింటిరాము, బొగ్గు నాగార్జున, బొగ్గు నారాయణస్వామి, నడిమిదొడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తలారి మహేష్, తలారి వంశీ, గణేష్, హరీష్ పాల్గొన్నారు.

చమన్‌సాబ్‌కు నివాళి



చమన్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల శ్రీరామ్

రామగిరి, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ చమన్‌సాబ్ ఏడో వర్ధంతిని ఆయన స్వగ్రామమైన ఆర్ కొత్తపల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. చమన్‌సాబ్ కుమారుడు ఉమర్ ముక్తర్ ఆయన సతీమణి రమీజా బేగం, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీఎత్తున హాజరై చమన్‌సాబ్ ఘాట్ వద్ద ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ...చమన్‌సాబ్ తమకు సాన్నిహిత్యంగా, కుటుంబ సభ్యుడిలా ఉండేవారన్నారు. ఆయన తన తండ్రితో కలిసి టీడీపీ బలోపేతానికి అప్పట్లో ఎంతో కృషిచేశారని అన్నారు. ఆయన లేనిలోటు తీరనిదన్నారు. ఆయన కుమారుడు ఉమర్‌ముక్తార్‌కు ఎప్పుడూ తమ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. చమన్‌సాబ్ ఆశయాలను కొనసాగించడానికి కలిసి పనిచేస్తామన్నారు. ఉమర్ ముక్తర్ మాట్లాడుతూ..తన తండ్రి ఆశయ సాధన కోసం కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ జయంత్యుత్సవాలు



కొత్తూరులో వజ్రకవచ చీరలో వాసవీమాత



పాతూరులో నగరోత్సవం ముందు కలశాలతో ఆర్యవైశ్య మహిళలు



పాతూరు ఉత్సవంలో రథంలోని వాసవీమాత

అనంతపురం కల్చరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నేత్రపర్వంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రాజురోడ్డులోని వైశ్య హాస్టల్‌లో సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి వైశ్య హాస్టల్ నుంచి ఊరేగించారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హాజరై అమ్మవారికి కలశం పట్టారు. ఆలయ ఆవరణలో వాసవీ హోమం నిర్వహించారు. మూలవిరాట్‌ను వజ్రకవచ చీరతో అలంకరించారు. నగరపాలకసంస్థ మాజీ మేయర్ మదమంచి స్వరూప హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పరుచూరు సూర్యప్రకాష్, కల్లూరు నాగరాజు, మిట్టా ఆంజనేయులు, టంగుటూరు నాగభూషణం, పొలమడ రమేష్‌బాబు, సతీష్, కిషోర్ కుమార్, నిర్మలమ్మ, జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి పోతుల మనోజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాతూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో పాతూరు ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం అధ్యక్షతన వాసవీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి ఊరేగించారు. వాసవీ మహిళా మండలి సభ్యులు నగరోత్సవానికి ముందు ర్యాలీగా సాగారు. కన్యకలు కలశాలు ఎత్తుకుని పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షుడు తిరువీధుల జగదీష్‌కుమార్, పాతూరు ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి చల్లా క్రిష్టరంగయ్య, నాయకులు గర్జాల నాగరాజు, ధూపకుంట్ల శబరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

● చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో బుధవారం స్థానిక ఆర్యవైశ్య సత్రంలో అమ్మవారిని అలంరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు కలశాలను తలపై ఎత్తుకుని పురవీధుల గుండా ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి ఆర్యవైశ్యులు పెద్దఎత్తున తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



కలశాల ఊరేగింపులో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



కోలాటమాడుతున్న భక్తులు

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు





నగరంలో ప్రత్యేక అలంకరణలో
గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి, పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి): శ్రీమద్వి రాట్ పోతులూరి వీరబ్రహ్మేం ద్రస్వామి ఆరాధనోత్సవాలను పాతూరులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవా రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, పురవీధుల్లో కలశాల ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తుల చేతులమీదుగా పుష్పార్చన, అష్టోత్తర శతనామార్చన చేయించారు. మహామంగళహారతి అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన వినియోగం చేపట్టారు. సాయంత్రం పాతూరు వీధుల్లో స్వామివారి నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గురుప్రసాద్, గౌరవాధ్యక్షుడు నాగభూషణాచారి, కుర్లపల్లి రంగాచారి, ప్రకాష్ ఆచారి, చంద్రమౌళి, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

● రాప్తాడు: మండల కేంద్రంలో వెలసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

● శింగనమల: మండలకేంద్రంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. శింగనమల చెరువు కట్ట వద్ద వెలసిన ఆలయం వద్ద ఉదయం స్వామి మూలవిరాట్‌ను అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. స్వామి చిత్రపటాన్ని రాత్రి గ్రామంలో ఊరేగించారు.

కుట్టు మిషన్లపై వైసీపీ ఆరోపణలు తగదు

● పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు

అనంతపురం అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టు మిషన్లు పంపిణీ చేసే కార్యక్రమంపై వైసీపీ నాయకులు ఆరోపణలు చేయడం తగదని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం టీడీపీ అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ అవినీతి పార్టీ అన్నారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలపై ఆ పార్టీ నాయకులతో అసత్యప్రచారం చేయించి, తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

అవినీతి పార్టీకి అంతా అవినీతిగానే కనిపిస్తోంది

● టీడీపీ నాయకుడు సిమెంట్ పోలన్న

అనంతపురం అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): అవినీతి పార్టీ వైసీపీకి ఏమి చూసినా అవినీతిలాగానే కనిపిస్తోందని టీడీపీ నాయకులు సిమెంట్ పోలన్న బుధవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడంతోపాటు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసే కార్యక్రమంపై వైసీపీ నాయకులు ఆరోపణలు చేయడం తగదన్నారు. కుట్టు శిక్షణ, మిషన్ల పంపిణీలో ఎక్కడా అవినీతికి తావులేదన్నారు.

ఎంఈఎఫ్ జిల్లా కార్యదర్శిగా నారాయణస్వామి

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సమాఖ్య(ఎంఈఎఫ్) జిల్లా సంయుక్త కార్యదర్శిగా బొందలదిన్నె నారాయణ స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఎంఈఎఫ్ జిల్లా కార్యవర్గం ఉత్తర్వులు జారీచేసిందని ఆయన తెలిపారు.

నేడు పాండురంగస్వామి నిజపాద స్పర్శదర్శనం

అనంతపురం కల్చరల్, మే 7(ఆంధ్రజ్యోతి): వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో స్వామి నిజపాద స్పర్శదర్శనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు భావసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్ బుధవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల చేతులమీదుగా స్వామివారి పాదస్పర్శ చేయిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● న్యాయవిజ్ఞాన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, మే 7(ఆంధ్రజ్యోతి): కార్మికులందరూ చట్టాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. జిల్లా కోర్టు న్యాయాధికారి భీమారావు ఆదేశాల మేరకు... జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ బస్సు డిపోలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రమాదేవి, డిఫెన్స్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాదులు నల్లప్ప, హరికృష్ణ, డిపో మేనేజర్ హాజరయ్యారు.

'పహల్గాం బాధితులపై ట్రోలింగ్ చేసే వారిని శిక్షించాలి'

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో ఆత్మీయులను కోల్పోయిన బాధిత హిమాన్సీ నర్వాల్, ఆరతిమీన తదితరులపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని పలు మహిళా సంఘాలు డిమాండ్‌చేశాయి. స్థానిక ఎన్జీఓ హోంలో బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రకోశాధికారి సావిత్రి అధ్యక్షతన వహించిన సమావేశానికి జేవీవీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రసూన, మహిళా జిల్లా కార్యదర్శి పద్మావతి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు రమణయ్య ముఖ్యవక్తలుగా హాజరై మాట్లాడారు. బాధితులకు భరోసాగా నిలవాల్సినవారు వ్యక్తిగత జీవితాలపై దుర్భాషలాడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటివారిని తక్షణమే గుర్తించి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు సీపీఎంతోపాటు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం కల్పించండి

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో టైంస్కేల్ ప్రాతిపదికన పనిచేస్తున్న మహబూబ్‌బాష కుటుంబానికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని టైంస్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మప్ప, చంద్రశేఖర్ నాయుడు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల వద్ద విద్యార్థి సంఘాల ఆందోళన



నారాయణ స్కూల్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, మే 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రైవేట్ స్కూళ్ల వద్ద విద్యార్థి సంఘాల నేతలు వేర్వేరుగా ధర్నాలు చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం నగరంలోని బస్టాండ్ వద్ద ఉన్న నారాయణ స్కూల్ వద్ద, ఏఐఎస్‌బీ, బీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య సంఘాల నేతలు ఆదిమూర్తినగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ వద్ద ధర్నా చేశారు. నారాయణ స్కూల్ వద్ద ధర్నా లో ఏఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హను మంతరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ... విద్యా ఏడాది ప్రారంభంకాక ముందే... అడ్మిషన్లు చేస్తున్న నారాయణ స్కూల్‌ను వెంటనే సీజ్ చేయాలని కోరారు. డేస్కాలర్‌కు రూ. 80 వేల నుంచి లక్ష వరకు ఫీజు వసూలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. విద్యాశాఖాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందు, మంజునాథ్, సమీర్, ప్రవీణ్, బాబాజాన్, ప్రశాంత్, జగన్ పాల్గొన్నారు. ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ఆదిమూర్తినగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌ను వెం టనే సీజ్ చేయాలంటూ ఏఐఎస్‌బీ, బీసీ,ఎస్సీఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య సంఘాల నాయకులు ధర్నా చేశారు. సంఘానాయకులు పృథ్వీ, సురేష్, విజయ్, మధు, ఉపేంద్ర, మనోహర్, ప్రవీణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

● నేడు మెట్లపూజ ● రేపు విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో హోమం చేస్తున్న శబరిమల ఆలయ అర్చకులు

బుక్కరాయసముద్రం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన బుక్కరాయసముద్రంలో బుధవారం అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని చెరువు కట్ట వద్ద నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం ఆలయ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు రోజుల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం గణపతి హోమం, మూలపూజ, విష్ణుపూజ, భగవతి సేవ తదితర పూజ కార్యక్రమాలను శబరిమల దేవాలయం అర్చకులు తంత్రి బ్రహ్మదత్త కంఠారు ఆధ్వర్యంలో నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి అయ్యప్పస్వామి మాల ధారులు, భక్తులు పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. గురువారం ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన 18మెట్లకు మెట్ల పూజత్సోవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆలయం ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అల్లూరి పోరాటం ఆదర్శం: కలెక్టర్



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామ రాజు పోరాటం అందరికీ ఆదర్శమని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం అల్లూరి వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా అల్లూరి చిత్రపటానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూస్వాతంత్ర్య పోరాటంలో సీతారామరాజు బ్రిటిష్ వారిపై చేసిన పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. అలాంటి నాయకుడి స్ఫూర్తితో మనమందరం ముం దుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌కలెక్టరు సచిన్‌రహార్, డీఆర్ఓ మలోల, కలెక్టరేట్‌ఏఓ అలెగ్జాండర్, జిల్లా టూరిజం శాఖాధికారి జయకుమార్, డీటీడబ్ల్యూఎస్ అధికారి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పీజీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వాలి

● ఏబీవీపీ నాయకులు

అనంతపురం సెంట్రల్, మే7(ఆంధ్రజ్యోతి): పోస్టు గ్రాడ్యుయేట్(పీజీ) విద్యార్థులకు ఇస్తామన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన ఐసెట్ పరీక్షా కేంద్రం వద్ద ఆందోళన చేట్టారు. నాయకులు అఖిల్‌కుమార్ రెడ్డి, దివాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన 77జీఓ విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. ఈ జీఓను రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను అందజేస్తామని మంత్రి నారా లోకేష్ యువగళంలో హామీ ఇచ్చారన్నారు. ఐసెట్ పరీక్షలు నిర్వహిస్తున్నా స్పష్టత లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్, విజయ్, భూతరాజు, శివరాజ్, వెంకటేష్, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న న్యాయవిద్య పరీక్షలు

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యాయవిద్య పరీక్షలు గురువారం ముగియన్నాయి ఎస్కేయూ ఫార్మసీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఈ) డాక్టర్ లోకేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 9 నుంచి ఐదేళ్ల ఎల్ఎల్‌బీ పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారంతో పరీక్షలు ముగుస్తాయని త్వరగతిన మూల్యాంకనం చేసి ఫలితాలు విడుదలచేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సోమశేఖర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం రూరల్, మే7(ఆంధ్రజ్యోతి): స్థాని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 888 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సెల్‌ఫోన్ రిపేరీపై ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మే 7(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ రిపేరీపై ఉచిత శిక్షణ ఈనెల 15వతేదీ నుంచి 30రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు కలిగి ఉమ్మడి జిల్లాలో 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామ న్నారు. వివరాలకు సెల్ నంబరు 9492583484ను సంప్రదించాలని కోరారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

అనంతపురం న్యూటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌కు చెందిన నాగరాజు(45) బుధవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న సుబ్బరాయుడు కుమారుడు నాగరాజు వెల్డింగ్ పని చేస్తు జీవించేవాడు. ఈయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. పిల్లల చదువుల కోసం అధిక అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో అర్థంకాక మనస్తాపంతో అనంతపురం, తాటిచెర్ల మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఢిల్లీ దాకా ఆర్డీటీ ఉద్యమం సాగాలి

● మూడోరోజు రిలేదీక్షల్లో పలువురు వక్తలు



రిలే దీక్షల్లో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

అనంతపురం సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): పేదల ఇంట్లో అభివృద్ధి కాంతులు వెలిగించిన ఆర్డీటీని కొనసాగించేలా అనంత నుంచి ఢిల్లీ దాకా వినిపించేలా ప్రజా ఉద్యమం సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. విదేశీ విరాళాల సేకరణ అనుమతులు ఆర్డీటీకి రెన్యువల్ చేయాలని కలెక్టరేట్ ఎదుట ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద అఖిలపక్ష కమిటీ చేపట్టిన రిలే దీక్షలు కొన సాగుతున్నాయి. మూడవ రోజైన బుధవారం అఖిలపక్ష కమిటీ కన్వీనర్ సాకేహరి అధ్యక్షతన వహించిన రిలే దీక్షలకు సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు చామలూరు రాజగోపాల్, జైభీమ్‌సేన టీకెస్ ఆనంద్ ముఖ్య వక్తలుగా హాజరై మాట్లాడారు. తరిమెల రాజు కళాబృందం పాటలతో ఆర్డీటీ సేవల ప్రాము ఖ్యాన్ని వివరించింది. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, హరినాథ్‌రెడ్డి, రామాంజినేయులు, రామకృష్ణారెడ్డి, గోవిందప్ప, శివశంకర్, రాము, రాజేష్, వసంతకుమార్, గోవర్ధన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే సేవ్ ఆర్డీటీ నినాదంతో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు కేపీ నారాయణస్వామి, చిన్న పెద్దన్న, ఓబులేసు, రమణ, చిన్న ఆంజనేయులు, ఈశ్వరయ్య, సంజీవులు, సత్యమయ్య, ఎర్రిస్వామి, పక్కీరప్ప, నాగరాజు, పుల్లన్న, కదిరప్ప, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు



కణేకల్లులో వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

గుంతకల్లుటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌లో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి 332వ ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం హోమం జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారు జీవసమాధి అయిన రోజు కావడంతో ఈ ఆరాధనలు నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్ ఆచారి, ఆలయ కమిటీసభ్యులు తెలిపారు.

●బెళుగుప్ప: మండల కేంద్రంలోని విరుపాక్షేశ్వర స్వామి ఆశ్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం రథోత్సవం వుంటుందని అర్చకులు తెలిపారు.

●కణేకల్లు: బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో స్వామివారి చిత్రపటాన్ని గ్రామపురవీధుల్లో ఊరేగించారు. వందలాది మంది మహిళలు హారతులు పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. బ్రహ్మంగారి ఆలయం నుంచి చిక్కణ్ణేశ్వరాలయం వరకు ఊరేగింపు సాగింది. అంతకుముందు ఆలయంలో విశేషపూజలు జరిపారు.

●పుట్లూరు: మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయం వద్ద ఉన్న పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

●పామిడి: పట్టణంలోని 44వ జాతీయ రహదారి సమీపంలో వెలసిన వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగించారు.

కుట్టుశిక్షణలో అవినీతిపై విచారణ చేపట్టాలి: వైసీపీ

గుంతకల్లుటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీసీ మహిళలకు చేపట్టిన కుట్టుశిక్షణలో కూటమి పార్టీల నాయకులు భారీ అవినీతికి తెరలేపారని వైసీపీ పట్టణ, మండల కన్వీనర్లు ఎండీఆర్ ఖలీల్, రాము ఆరోపించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే శిక్షణలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ కుట్టుమిషన్ అందించాలని కోరారు. సమావేశంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రంగనాయకులు, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు లింగన్న, పంచాయతీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు తిక్కస్వామి, నాయకులు పాల్గొన్నారు.

చప్పగా.. సర్వసభ్య సమావేశం

కూడేరు, మే 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశం చప్పగా సాగింది. ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో శాఖల వారిగా ఆయా అధికారులు ప్రగతి నివేదికలను వివరించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు చర్చకు రాలేదు. ప్రజా ప్రతినిధులు కూడా పట్టించుకోకపోవడంతో సమావేశం చప్పగా సాగింది. వైస్ ఎంపీపీ దేవా, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పాముకాటుతో ఉపాధి కూలీకి అస్వస్థత

బొమ్మనహాళ్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉద్దేహాళ్ గ్రామంలో బుధవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీ వన్నూరుస్వామిని పాము కాటు వేసింది. దీంతో అస్వస్థతకు గురవడంతో తోటి కూలీలు వెంటనే శ్రీధరఘట్ట వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ ఆసుపత్రికి వెళ్లి అతడిని పరామర్శించి రూ.రెండు వేలు ఆర్థిక సాయం చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారని వారు పేర్కొన్నారు.

ఉపాధి కూలీపై ఎలుగుబంటి దాడి

రాయదుర్గం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన ఉపాధికూలీ ఎర్రప్పపై బుధవారం తెల్లవారుజామున ఎలుగుబంటి దాడి గాయపరిచింది. రోజూ మాదిరిగానే ఎర్రప్ప తోటి కూలీలతో కలిసి ఉపాధిపనికి వెళుతుండగా అటవీప్రాంతం వద్ద ఒక్కసారిగి ఎలుగుబంటి అతడిపై దాడి చేసింది. ఇది చూసిన తోటి కూలీలు పరుగులు తీశారు. ఎర్రప్పను తీవ్రంగా గాయపరిచి తర్వాత అది అడవిలోకి వెళ్లిపోయిందని కూలీలు చెప్పారు. అతడిని రాయదుర్గం ఆసుపత్రికి తీసుకెళ్లగా. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి

యాడికి, మే 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో పేదల అభ్యున్నతికి అనునిత్యం కృషిచేస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం నిర్మూలించడానికి ఆర్డీటీ ఎంతగానో కృషి చేస్తున్నదని తెలిపారు. ఇలాంటి సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏను రద్దుపరచడం తగదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు చేపట్టి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్, సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి బషీర్‌అహ్మద్, సీపీఐ మండల కార్యదర్శి జూటూరు రఫీ, సహాయ కార్యదర్శి వడ్డె రాముడు తదితరులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రాయదుర్గం, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కణేకల్లు రోడ్డులో నివాసం ఉంటున్న వడ్డే రవి(38) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వడ్డే రవి టైలరింగ్ పనిచేస్తూ జీవనాన్ని సాగించేవారు. అయితే తాగుడుకు బానిసైన అతను జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య సునీత, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

తుప్పు పడుతున్న 108 వాహనం

● మరమ్మతులకు గురవడంతో ఆస్పత్రిలో ఓ మూలన పడేసిన వైనం

కళ్యాణదుర్గం, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీహెచ్‌సీలో 108 వాహనం మరమ్మతులకు గురవడంతో కొన్నినెలలుగా మూలన పడేశారు. బాగు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సిన అధికారులే నిర్లక్ష్యపు ధోరణితో సీహెచ్‌సీ ఆవరణలోనే ఓ మూలన ముళ్లకంపల మధ్యలో పడేశారు. ఫలితంగా నేడు ఆ 108 వాహనం నిరుపయోగంగా ఉండి ఎండకు ఎండుతూ.. వాన కు తడుస్తూ తుప్పు పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ వాహనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆస్పత్రిలో మూలన పడి ఉన్న 108 వాహనం

పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: కాలవ



పాడి రైతులకు పశుదాణా పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, మే 7(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని 74 ఉడేగోళం గ్రామంలో గల రైతు సేవా కేంద్రంలో బుధవారం పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా కాలవ పాల్గొని కార్యక్రమాన్ని పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం పాడి రైతులకు పశువులదాణా పంపిణీ చేస్తోందని తెలిపారు. 50 కేజీల దాణా బ్యాగ్ ధర రూ. 1110 లు అని, అయితే అందులో 50 శాతం సబ్సిడీ పోను రూ.555 లకే రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. రాయదుర్గం మండ లానికి 25 మెట్రిక్ టన్నుల పశుదాణాను కేటాయించారన్నారు. దీని వలన సుమారు 500 మంది పాడిరైతులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. అనంతరం పశువైద్యులు నాగలింగేశ్వర్‌రెడ్డి పశువుల దాణా ఉపయోగాలు వివరిస్తూ, శాఖ తరఫున అమలవుతున్న పశుభీమా, గోకులాలు, నీటితొట్టెల నిర్మాణం వంటి వాటి గురించి వివరించారు. టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు, మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ పురుషోత్తం, జుంజురంపల్లి సర్పంచ్ వన్నూరుస్వామి, టీడీపీ బెంగళూరు ఫోరం సభ్యుడు బాలచంద్ర, నాయకులు శివానంద, ఓబన్న, రామస్వామి, పాడిరైతులు, పశుసంవర్ధక సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓబులయ్య కుంటకు నీరివ్వాలని వినతి



మంత్రి కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కూడేరు, మే 7(ఆంధ్రజ్యోతి): కూడేరు సమీపంలోని ఓబులయ్యకుంటకు హంద్రీ-నీవా కాలువ నుంచి నీరు ఇవ్వాలని స్థానిక రైతులతో పాటు కడదరకుంట గ్రామ రైతులు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరారు. అనంతపురంలో రామ్‌నగర్‌లో గల క్యాంపు కార్యాలయంలో బుధవారం వారు మంత్రిని కలిసి మాట్లాడారు. ఓబులయ్యకుంటలో నీరు నిల్వ చేస్తే కూడేరు, కడదరకుంట, సింగపల్లి గ్రామాల సమీపంలోని వందలాది బోర్లలో నీటిమట్టం పెరుగుతుందన్నారు. దీంతో పంటల సాగుకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. అనంతరం ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రైతులు తెలిపారు.

కన్యకా పరమేశ్వరి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కడప రోడ్డులో గల ఐశ్వర్య విల్లాస్ వద్ద వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి భారీ విగ్రహం ఏర్పాటుకు బుధవారం భూమిపూజ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొని కార్యక్రమం చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. అమ్మవారి విగ్రహం తూర్పుదిక్కున ఏర్పాటు చేయడం పట్టణానికి ఎంతో శుభపరిణామమన్నారు. ఈ దారి గుండా పట్టణంలోని వచ్చే వారికి అమ్మవారి నిలువెత్తు విగ్రహం దర్శనమయ్యేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం వల్ల పట్టణ ప్రజలకు, వాహనదారులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు సురేంద్రనాథ్, సభ్యులు అశ్వర్థ రంగయ్య, వంకదారి రాజా, టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, సూర్యముని, చింబిలి వెంకటరమణ, జగదీశ్వరరెడ్డి, శింగరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ అమలుపై సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న హిందూ ఐక్యవేదిక నాయకులు

తాడిపత్రి, మే 7(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాదులపై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైనిక దళాలు దాడిచేసి హతమార్చినందుకుగాను బుధవారం పట్టణంలోని గాంధీసర్కిల్లో హిందూ ఐక్యవేదిక నాయకులు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చారు. అలాగే కేక్‌కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తలపెట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్రవాదులు నామరూపాలు లేకుండా పోతారని తెలిపారు. మోదీకి దేశ ప్రజలందరూ మద్దతు తెలపాలని కోరారు. నాయకులు రాధాకృష్ణ, గంగరాజు, రామ్మూర్తిరెడ్డి, రమేష్, హనుమంతరెడ్డి, నరసింహారెడ్డి, రామాంజనేయులు, కుళ్లాయప్ప, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జేసీ ఇంటి వద్దకు భారీగా టీడీపీ శ్రేణులు

తాడిపత్రి, మే 7(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం తాడిపత్రి వస్తున్నారని తెలియడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం పెద్దఎత్తున స్థానిక మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ రద్దీ వాతావరణం చోటు చేసుకుంది.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

యాడికి, మే 7(ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పెద్దపప్పూరు మండలం నుంచి యాడికికి ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నట్లు సమాచారం అందిందని, దీంతో దాడులు చేసి వేములపాడు జాతీయ రహదారిపై రెండు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేసినట్లు చెప్పారు. అనంతరం ట్రాక్టర్లను యాడికి పోలీస్‌స్టేషన్ వద్దకు తరలించారు.

ఆర్‌బీ వంకలో చోరీ

రాయదుర్గం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీవంక గ్రామంలో శేషనాయక్ అనే వ్యక్తి ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. శేషనాయక్ ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కళ్యాణదుర్గం నియోజవర్గం బొమ్మిగానిపల్లికి శుభకార్యానికి వెళ్లారు. వేడుకలు ముగించుకుని బుధవారం తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులకున్న తాళం ధ్వంసమై కనిపించింది. వారు వెంటనే లోపలికెళ్లి చూడగా.. బీరువాలోని రూ.70 వేల నగదు, 20 తులాల వెండి కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గ్రహించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నేడు అత్యవసర కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ శివరామకృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

పామిడిలో ఇరువర్గాల ఘర్షణ

పామిడి, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణస్వామి వీధిలో బుధవారం సాయంత్రం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణస్వామి వీధికి చెందిన శివ వర్గం, హనుమాన్ థియేటర్ లింక్ రోడ్డుకు చెందిన బాలరాజు వర్గం పాతకక్షలను మనసులో పెట్టుకొని ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఇందులో బాలరాజు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పొలం దారి తగాదా.. ఒకరిపై దాడి

గుత్తి రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లిలో బుధవారం ఘర్షణ జరిగి బొలికొండి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బొలికొండతో మరో వర్గానికి చెందిన రమేష్, రవి, వెంకటరాముడు కలిసి పొలం దారి విషయంలో ఘర్షణ పడి కర్రలతో దాడి చేశారు. ఇందులో బొలికొండికు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

భూవివాదంలో దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

యాడికి, మే 7 (ఆంధ్రజ్యోతి): రాయలచెరువులో వరకృష్ణ అనే వ్యక్తిపై దాడిచేసి గాయపరిచిన ఘటనలో వరరమేష్ అతని స్నేహితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈరన్నపల్లె గ్రా మంలో భూ వివాదానికి సంబంధించి మంగళవారం రాత్రి యాడికి పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడి ఇంటికి వెళుతున్న రామరాజుపల్లెకు చెం దిన వరకృష్ణపై రాయలచెరువులో వరరమేష్, అతని స్నేహితుడు కట్టెలతో దాడిచేసి గాయపరిచారు. వరకృష్ణను స్థానికులు యాడికి ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం తాడిపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు

యాడికి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిట్టూరు గ్రామంలో ఇంటివద్ద పెంచుకుంటున్న కోళ్లపై కుక్క తరచూ దాడి చేస్తున్నదని గొడవపడి గాయపరచుకున్న సంఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. నిట్టూరు గ్రామంలో రాధమ్మ అనే మహిళ ఇంటివద్ద కోళ్లను పెంచుకుంటోంది. కాగా ఇంటిపక్కనే ఉన్న వీరాంజనేయులుకు చెందిన కుక్క తమ కోళ్లపై తరచూ దాడి చేసి చంపేస్తోందని బుధవారం రాత్రి ఆమె వారితో గొడవపడ్డారు. ఈ క్రమంలో దాడులు చేసుకుని ఇరువర్గాల వారు గాయాలపాలయ్యారు. రాధమ్మ ఫిర్యాదు మేరకు పుల్లయ్య, వీరాంజనేయులు, మల్లేశ్వరిపై కేసు నమోదు చేశారు. అలాగే వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు వెంకటనారాయణ, రాధమ్మ, అరుణ్‌కుమార్, రామాంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భూతగాదాలో ఒకరిపై దాడి

తాడిపత్రి, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పుట్లూరురోడ్డులో గల రఘుఫంక్షన్ హాల్ సమీపంలో బ్రహ్మానందరెడ్డిపై ఓబులరెడ్డి, నాగిరెడ్డి మరొకరు కలిసి దాడిచేశారని రూరల్ పోలీసులు తెలిపారు. పుట్లూరు మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన బ్రహ్మానందరెడ్డి పట్టణంలోని రెడ్డివారిపాలెంకు చెందిన నాగిరెడ్డి, ఓబులరెడ్డిలకు భూముల తగాదా ఉందని, వాటివల్ల మాటామాటా పెరిగి బ్రహ్మానందరెడ్డిపై దాడిచేసి గాయపరిచారని పోలీసులు చెప్పారు.

టీడీపీ, వైసీపీ వర్గీయుల ఘర్షణ

తాడిపత్రి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నెలో బుధవారం రాత్రి వైసీపీ మద్ధతుదారులు వేణుగోపాల్‌రెడ్డి, రంగయ్యపై టీడీపీ మద్ధతుదారులు దాడి చేసి గాయపరిచారని పోలీసులు తెలిపారు. గ్రామంలో వాటర్‌ప్లాంట్ విషయంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసిందన్నారు. గాయపడిన వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని వారు చెప్పారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోండి

యాడికి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన వారు కొత్త రేషన్‌కార్డులకు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సీఎస్‌డీటీ సూర్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు, మెంబరు అడిషన్, రేషన్‌కార్డు స్ప్లిట్టింగ్, మెంబరు డిలేట్, రేషన్‌కార్డులో చిరునామా మార్పు, రేషన్‌కార్డు సరెండర్, ఆధార్‌కార్డు సీడింగ్ వంటి 7రకాల సేవలను బుధవారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆశావర్కర్ల సమ్మె నోటీసు

తాడిపత్రి, మే7(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధనకై ఈనెల 20న ఆశా వర్కర్లు చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును బుధవారం మెడికల్ అధికారికి అందజేశారు. పట్టణంలోని టైలర్స్‌కాలనీలో ఉన్న యూపీహెచ్‌సీ వద్ద ఆశావర్కర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కమ్యూనిటీ హెల్త్‌వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలన్నారు. ఈడిమాండ్ల సాధనకు సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నోటీసు అందించిన వారిలో యూనియన్ కమిటీ సభ్యురాలు నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

బ్రహ్మసముద్రం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నూతన ఎంపీడీవోగా విజయసింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న అతను పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

ఈఓఆర్‌డీకి ఎంపీడీఓగా పదోన్నతి

పుట్లూరు, మే7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్‌డీగా పనిచేసే జిలాన్‌బాషాకి ఎంపీడీఓగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన శెట్టూరు మండలానికి బదిలీ అయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి, మే 7(ఆంధ్రజ్యోతి) :పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గుత్తి పట్టణానికి చెందిన ప్రవీణ్‌కుమార్ బైక్‌పై అనంతపురానికి బయలుదేరాడు. పట్టణ శివారులో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ

బెళుగుప్ప, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకున్న మండలంలోని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు వాటిని అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బొమ్మనహాళ్, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ బుధవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి పని తగ్గ వేతనం, సకాలంలో బిల్లులు అందుతున్నాయా అని ఆరా తీశారు. సమయవేళలు పాటించి, కొలతల ప్రకారం పనిచేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివన్న, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తనిఖీచేశారు. వేములపల్లి, 85నిట్టూరు గ్రామాల్లో పని ప్రదేశాల వద్దకు వెళ్లి కూలీల హాజరును పరిశీలించి మస్టర్‌ను తనిఖీచేశారు. కొలతల ప్రకారం పనులు చేయాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ జయరాం, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు ఆడిట్ నివేదిక అందజేత

తాడిపత్రి, మే 7(ఆంధ్రజ్యోతి): 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మున్సిపల్ రికార్డులను జిల్లా ఆడిట్ అధికారులు బుధవారం పట్టణంలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. నెలరోజుల నుంచి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీచేసి పూర్తిస్థాయిలో నివేదికను తయారుచేసి చైర్మన్‌కు అందించినట్లు అధికారులు తెలిపారు. అలాగే మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల గురించి చైర్మన్‌తో చర్చించినట్లు వారు చెప్పారు.

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి: ఏఐఎస్ఎఫ్

గుంతకల్లుటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక నారాయణ పాఠశాల వద్ద బుధవారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభం కాకమునుపే కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్లు చేస్తూ.. ఫీజులు, పుస్తకాల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. వాటిపై విద్యాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు అఖిల్‌కుమార్, ఫర్హాన్, ముస్తఫా, జయరాం, సాయికృష్ణ, మున్నా, రోహిత్ పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మెను విరమింపజేయండి

కళ్యాణదుర్గంరూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులను సమ్మె విరమింప చేసే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 32 రోజులుగా శ్రీరామిరెడ్డి కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరా ఆగిపోయిందన్నారు. దీంతో గ్రామాలప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడంతో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. అధికారులు శ్రీరామిరెడ్డి కార్మికులతో మాట్లాడి బకాయిలను త్వరితగతిన ఇచ్చే విధంగా ఏర్పాటు చేసి నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పదో తేదీన అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. కార్యక్రమంలో బ్రహ్మసముద్రం సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు నాయక్, తాలుకా జాయింట్ సెక్రటరీ నరసింహులు, టౌన్ జాయింట్ సెక్రెటరీ బుడేన్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన

తాడిపత్రి, మే7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్‌లో భాగంగా బుధవారం విద్యార్థులకు గ్రంథాలయాలపట్ల అవగాహన కల్పించినట్లు గ్రంథాలయ అధికారి రవికుమార్‌నాయుడు తెలిపారు. విద్యార్థిదశ నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు.

వాసవీమాతా.. నమోస్తుతే..

● వైభవంగా అమ్మవారి జయంత్యుత్సవాలు ● ఆలయాల్లో ప్రత్యేక పూజలు



గుత్తి ఆర్ఎస్‌లో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత



పామిడిలో..



రాయదుర్గంలో..



యాడికిలో వాసవీమాత చిత్రపటం ఊరేగింపు



కణేకల్లులో ఉత్సవ విగ్రహం ఊరేగింపు



బొమ్మనహాళ్ మండలం గోవిందవాడలో కలశాలతో గంగాజలాన్ని తెస్తున్న ఆర్యవైశ్య మహిళలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: వాసవీమాత జయంత్యుత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాల్లోని కన్యకాపరమేశ్వరి ఆలయాల వద్దకు ఆర్యవైశ్య మహిళలు ఉదయమే గంగాజలాన్ని, ఆవుపాలను కలశాల్లో ఊరేగింపుగా తెచ్చారు. అనంత రం వాటితో అమ్మవారి మూలవిరాట్‌ను అభిషేకించారు. తర్వాత ప్రత్యేక అలంకరణలు, పూజలు చేసి మహామంగళహారతి ఇచ్చారు. తర్వాత సాయంత్రం ఉత్సవ విగ్రహాలను, చిత్రపటాలను పల్లకిలలో ఉంచి ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘాల నాయకులు, వాసవీ మహిళా సంఘాల సభ్యులు, ఆలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.